



పాతూరులో అనురాధ వైన్స్.. ఇక్కడే కొని.. తాగేలా ఏర్పాట్లు

నగరపాలిక ఎప్పుడు బాగుపడుతుందో తెలియని పరిస్థితి. అభివృద్ధి విషయం అటుంచితే.. ఏ పని జరగాలన్నా నోటి మాటలు సరిపోవని.. నోటు మాట్లాడితే ఇట్టే పని జరుగుతుందని ప్రచారం ఉంది. ఇది బహిరంగ రహస్యం. పాలకవర్గం అలసత్వం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో పరిస్థితి నానాటికీ అధ్వానంగా మారుతోంది. ఏడాదిన్నర నుంచి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఏడాది వ్యవధిలో ఏకంగా ఐదుగురు కమిషనర్లు మారిపోయారంటే.. పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. నగరపాలికలో కీలకమైన ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లేదు. ఇదో పెద్ద సమస్యగా మారింది. కౌన్సిల్ సమావేశం మంగళవారం జరగనుంది. ఈ నేపథ్యంలో.. 'కొన్ని సమస్యలు.. అవినీతిలో కాస్త..' ఉదహరిస్తూ.. కథనం.

-అనంతపురం క్రైం, (ఆంధ్రజ్యోతి)




ఎన్టీఆర్ సర్కిల్‌లో ధ్వంసమైన రోడ్డు

నోటుతో మాట్లాడారు..!

నగరపాలికలో కరెన్సీతోనే పని

- ఎవరి సంపాదనపై వారి దృష్టి
- అభివృద్ధి ఆలోచన లేని అధికారులు
- జేబు నిండితే చాలన్నట్లు కార్పొరేటర్లు
- నేడు కౌన్సిల్ సమావేశం

ఒక్కరికే రెండు...

పాతూరు నగరపాలిక కాంప్లెక్స్ అక్రమాలకు నిలయంగా మారింది. అక్కడ రెండు షాపులను ఒకరికే కేటాయించారు. ఇందులో ఒకటి అనూరాధ వైన్స్‌కు, మరొకటి పక్కనే కూర్చుని మద్యం సేవించేందుకు వాడుతున్నారు. ఒక్కొక్క షాపు అద్దె రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు మాత్రమే ఉంటుంది. కానీ మద్యం షాపు నిర్వాహకుల నుంచి రూ.70వేలకు పైగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో నగరపాలికకు జమ అయ్యే మొత్తం పోనూ, మిగిలిన రూ.60 వేలు ప్రతి నెలా పక్కదారి పట్టినట్లే. మున్సిపల్ కాంప్లెక్స్‌లో గదులకు 30 సంవత్సరాల క్రితం వేలం నిర్వహించారు. ఆ సమయంలో షాపులు దక్కించుకున్నవారు ఇతరులకు అద్దెకు ఇచ్చారు. అప్పనంగా డబ్బు సంపాదిస్తున్నారు. పాతూరులోని దాదాపు అన్ని దుకాణాల పరిస్థితి అంతే. క్లాక్ టవర్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ నగర పాలిక ఆదాయానికి ఏటా రూ.50 లక్షలకుపైగా గండి పడుతోంది. రెవెన్యూ విభాగం అధికారులకు ముడుపులు వెళుతున్నందున ఎవరూ ఏమీ మాట్లాడటం లేదని ప్రచారం జరుగుతోంది.


అంబేడ్కర్ నగర్ పరిధిలో మురుగు తీసి నెలలుగా అలాగే ఉంచిన దృశ్యం

ఆ ఇద్దరికీ పడదు...

నగరపాలికకు ఇన్‌చార్జి కమిషనర్‌గా రామలింగేశ్వర్ రెండు రోజుల క్రితం నియమితులయ్యారు. ఈయన ఇదివరకు అడిషనల్ కమిషనర్‌గా ఉన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు. వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని నగరపాలిక కోడై కూస్తోంది. రెవెన్యూ విభాగాన్ని గతంలో డిప్యూటీ కమిషనర్‌గా అప్పగించేవారు. కానీ దాన్ని రెండుగా విడగొట్టి.. అడిషనల్ కమిషనర్‌కు సగం, డిప్యూటీ కమిషనర్‌కు సగం అప్పగించారు. గ్రీవెన్స్, కౌన్సిల్ మీటింగ్ లాంటి వ్యవహారాలను డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించారు. ఈ కారణంగానే వారిద్దరి మధ్య విభేదాలు మొదలైనట్లు సమాచారం. అడిషనల్ కమిషనర్ ఇప్పుడు ఇన్‌చార్జి కమిషనర్ కావడంతో ఇకపై ఇద్దరి మధ్య వ్యవహారం ఎలా ఉంటుందో అన్న చర్చ మొదలైంది. ఉన్నతాధికారులు ఇద్దరూ ఎడమొహం.. పెడమొహంగా ఉంటే.. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పనితీరు గాడితప్పే ప్రమాదం ఉంది.

అవినీతి అభివృద్ధి..

అనంతపురం మున్సిపాలిటీ 2005లో కార్పొరేషన్‌గా అవతరించింది. రెండు దశాబ్దాలు గడిచినా అభివృద్ధి పెద్దగా కనిపించదు. అవినీతి మాత్రం అన్ని మూలలా విస్తరించింది. నగరపాలిక కార్యాలయం నుంచి మురికివాడల వరకూ వేళ్లూనుకుంది. కీలకమైన రెవెన్యూ విభాగంలో టైటిల్ ట్రాన్స్‌ఫర్ నుంచి భవనాలకు పన్ను వేసే విషయం వరకు అంతా నోట్ల కట్టలే మాట్లాడుతాయి. తాజాగా ఆర్ఐ, ఆర్వో పోస్టుల మార్పు విషయంలోనే రూ.లక్షల్లో బేరసారాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక టౌన్‌ప్లానింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే.! 'ఆ విభాగాన్ని తలచుకుంటే వణుకు పుడుతుంది..' అని గత కమిషనర్ అన్నారంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నగరంలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు విచ్చలవిడిగా కడుతున్నారు. వాటిపై చర్యలు తీసుకోవడం మానేసి.. డబ్బులు గుంజుతున్నారు. నగరపాలిక ఆదాయాన్ని పెంచాల్సిందిపోయి.. సొంత ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. నగరంలో పారిశుధ్యం విషయంలో ఏమాత్రం మార్పు లేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లను మార్చడంలోనూ బేరసారాలు జరిగితే.. ఇక నగరంలో కంపు ఎలా వదులుతుంది..? ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలోనూ దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాస్టిక్ నిషేధం అటకెక్కింది. వాటిని విక్రయించే దుకాణాల నుంచి పారిశుధ్యం విభాగం అధికారులు కొందరు నెల మామూళ్లు పుచ్చుకుంటున్నారు. ఇంజనీరింగ్ విభాగం నిద్రావస్థలో ఉంది. గుంతల రోడ్లు అలాగే దర్శనమిస్తున్నాయి. పనులు ముందుకు సాగడం లేదు. కానీ.. పర్సెంటేజీలు గుంజే విషయంలో మాత్రం ఇంజనీరింగ్ విభాగంవారు 'చురుగ్గా' వ్యవహరిస్తున్నారని సమాచారం. ఏదో చేస్తారని, సమస్యలను పరిష్కరిస్తారని నమ్మి.. ఓట్లేసి గెలిపించిన నగరవాసుల గురించి కార్పొరేటర్లు ఆలోచించడం మానేశారు. కొందరు మరీ అధ్వానంగా జేబు నిండితే చాలు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇన్ని సమస్యల నడుమ బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జి కమిషనర్ రామలింగేశ్వర్.. ఏమాత్రం ప్రభావం చూపుతారో వేచి చూడాల్సిందే.

ఏడాదిలో ఐదుగురు..

ఏడాదిలో ఐదుగురు కమిషనర్లు మారడం నగరపాలిక అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. కమిషనర్ భాగ్యలక్ష్మి బదిలీ అనంతరం ఆమె స్థానంలో ఐఏఎస్ అధికారి మేఘ స్వరూప్ వచ్చారు. ఆయన త్వరగా బదిలీ కావడంతో పెద్దగా ప్రభావం కనిపించలేదు. ఆ తరువాత పీవీవీఎస్ మూర్తి వచ్చారు. గతంలోనే ఆయన కమిషనర్‌గా పనిచేసినా.. ఎలాగూ వెళ్లిపోతాననే భావనంతో ఏ విషయాలనూ పెద్దగా పట్టించుకోలేదు. అనంతరం నాగరాజు బాధ్యతలు చేపట్టారు. మొదట్లో హుషారుగా కనిపించినా.. మూడు నెలలకే డీలా పడ్డారు. పాలకవర్గం, అధికారపక్షం ఒత్తిళ్లను ఆయన భరించలేకపోయారు. అనారోగ్యం పేరిట దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లిపోయారు.


బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్, జేసీ ఇతర అధికారులు

జిల్లా ఆఫీసర్లు ఎట్లయ్యారు..?

- ఫైళ్ల నిండా తప్పులే
- సచివాలయానికి పంపితే నవ్వుతారు..
- జిల్లా అధికారులపై మండిపడ్డ కలెక్టరు

అనంతపురం టౌన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): 'మీరందరూ జిల్లా ఆఫీసర్లు. మీరు ఈ-ఫైల్‌ద్వారా పంపే ఫైళ్లను ఓసారి చూసుకున్నారా? దాని నిండా తప్పులే. ప్రతిదానికి ఓ పద్ధతి ఉంటుంది. మీరుపంపే ఫైళ్లలో ఎక్కడా ఏపద్ధతీ ఉండటం లేదు. పైగా స్పెల్లింగ్ మిస్టేక్స్. జిల్లా ఆఫీసర్లు ఎట్లా అయ్యారు' అని కలెక్టరు వినోద్‌కుమార్ సోమవారం తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన.. అధికారులపై ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా అధికారులు బాగానే పనిచేస్తున్నారని, సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు ముందుంటున్నట్లు రాష్ట్ర అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి కితాబు వస్తోందన్నారు. ఇక్కడ ఫైళ్లు రాయడం మాత్రం సరిగా లేదని పేర్కొన్నారు. ఆఫైళ్లను అలాగే సచివాలయానికి పంపిస్తే ఉన్నతాధికారులు నవ్వుకుంటారన్నారు. అందుకే మీరు పంపిన ఫైళ్లను నేను సరిదిద్ది పంపుతున్నా అని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఫైళ్లు రాయడంపై జిల్లా అధికారులకు శిక్షణ ఇవ్వాలని జేసీ, డీఆర్ఓ, సీపీఓలను కలెక్టర్ ఆదేశించారు. ఈశిక్షణలో అందరు అధికారులు రిజిస్టర్ కావాలన్నారు. భూసమస్యలు అధికంగా వస్తున్నాయని, రెవెన్యూలో ఎక్కువ అర్జీలు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ప్రతిశుక్రవారం దీనిపై ప్రత్యేకంగా సమావేశం పెట్టుకొని పరిశీలించాలని,ఆతర్వాత సమాచారం తనకు తెలపాలని జేసీ, డీఆర్ఓలను కలెక్టరు ఆదేశించారు.

'స్వర్ణ అనంత'కు కృషి చేయండి

స్వర్ణాంధ్ర-విజన్ 2047కి సంబంధించి అభివృద్ధి ప్రణాళికలను శాఖల వారీగా సిద్ధం చేయాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. ఇటీవల కలెక్టర్లతో సమీక్ష సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలులో అనంత జిల్లా ఎప్పుడూ తొలి ఆరు స్థానాల్లో ఉంటోందని సీఎం చంద్రబాబు అభినందించినట్లు వెల్లడించారు. క్రైమ్ రిపోర్టు, మహిళాశిశు సంక్షేమశాఖలో అంగన్‌వాడీల నిర్వహణ విషయంలో వెనుకబడి ఉన్నట్లు వారు పేర్కొన్నట్లు వివరించారు. హార్టికల్చర్ హబ్‌గా జిల్లాను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, స్వర్ణ అనంత సాధనకు జిల్లా అధికారులందరూ మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టరు ఆదేశించారు. చౌకధరల డిపోలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని సివిల్‌సప్లై, తహసీల్దార్లను కలెక్టరు ఆదేశించారు. అర్హులకు మాత్రమే పింఛన్లు అందేలా చూడాలన్నారు. ప్రతి జిల్లా అధికారి టూర్ డైరీలను కలెక్టరేట్‌కు పంపాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో ఎక్కువ ఫిర్యాదులు వచ్చిన గ్రామాలకు తానే విజిట్‌కు వెళతానన్నారు. ప్రభుత్వ పథకాలను పెద్దఎత్తున ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశించారు.

గ్రీవెన్స్‌కు 355 ఫిర్యాదులు

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కొనసాగింది, జిల్లా నలుమూలల నుంచి 355మంది బాధితులు వివిధ సమస్యలతో వచ్చి వినతులు ఇచ్చారు. కలెక్టరు వినోద్‌కుమార్, జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్ఓ మలోల, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు తెలిపి వాటిని పరిష్కరించాలని కలెక్టరు ఆదేశించారు.



కణేకల్లులోని తహసీల్దార్ కార్యాలయం

2 కోట్ల పాట్లు..!

- ప్రభుత్వ ఖాతాలోకి రైతుల భూములు
- మిగులు పేరిట మళ్లించిన వైసీపీ ప్రభుత్వం
- రైతుల వద్ద ధ్రువపత్రాలు ఉన్నా.. తంటాలు
- జేసీ నిర్ధారిస్తేనే తిరిగి రైతుల ఖాతాల్లోకి..
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ

కణేకల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): భూములపై సర్వ హక్కులు ఉండి.. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా.. ఏదో కారణం వల్ల కొందరు రైతులు తమ పాసుపుస్తకాల్లోకి వాటి వివరాలను ఎక్కించుకోలేదు. అలాంటి భూములను జగన్ ప్రభుత్వం 'మిగులు భూములు'గా చూపించి.. ప్రభుత్వ ఖాతాలోకి జమ చేసింది. వాటిని తిరిగి దక్కించుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వేలాది ఎకరాలను ఇలా (20001901) టూ క్రోర్స్ ఖాతాలోకి మళ్లించింది. ఇవి తిరిగి రైతుల ఖాతాల్లో చేరాలంటే జాయింట్ కలెక్టర్ దాకా వెళ్లాల్సిందే. చిన్న చిన్న కారణాలతో తమ భూములను పాసుబుక్కుల్లోకి ఎక్కించుకోలేని రైతులకు టూ క్రోర్స్ ఖాతా శాపంగా మారింది. బాధిత రైతులు వీఆర్వోలను సంప్రదించి, తమ వద్ద ఉన్న భూమి హక్కు పత్రాలు, ఈసీలు చూపించి, ఒక ఫైల్‌ను తయారు చేయించాల్సి వస్తోంది. ఆ తర్వాత తహసీల్దారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆర్డీఓకు ఆ నివేదికను పంపాలి. ఆర్డీఓ పూర్తిస్థాయిలో పరిశీలించి, జాయింట్ కలెక్టర్‌కు పంపుతారు. ఆ తర్వాత జేసీ పరిశీలించి, భూములు రైతులవేనని నిర్ధారిస్తేనే రైతుల పాసుబుక్కుల్లోకి ఎక్కించేవీలుంది. ఈ తతంగాన్ని పూర్తి చేసేందుకు రైతులు నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కనీసం ఆరు నెలల సమయం పడుతోందని, వ్యయప్రయాసలకోర్చి తిరుగుతున్నామని బాధితులు వాపోతున్నారు.

వైసీపీ ప్రభుత్వం అత్యుత్సాహం

మిగుల భూముల నమోదు ప్రక్రియ గతంలో సరళంగా ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శించింది. మిగులు భూములన్నింటినీ రెవెన్యూ కార్యాలయాలలో లాక్‌లో ఉంచింది. ఓ ఖాతాను సృష్టించి అందులో ఇలాంటి భూముల వివరాలన్నింటిని నమోదు చేయించింది. దీన్నే రెవెన్యూ పరిభాషలో టూ క్రోర్స్ (2 కోట్ల) ఖాతాగా పిలుస్తారు. కణేకల్లు మండలంలోని అనేక మంది రైతుల మిగులు భూములు టూ క్రోర్స్ ఖాతాలోకి మళ్లాయి. సొంత ఖాతాల్లో తిరిగి నమోదు చేయించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. జాయింట్ కలెక్టర్ వద్దకు వెళితేనే సమస్య పరిష్కారమౌతుందని స్థానిక రెవెన్యూ అధికారులు చెబుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆ ఖాతాను తొలగించాలి..

టూ క్రోర్స్ ఖాతాను వెంటనే తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని హక్కులు, ఆధారాలు ఉన్నా.. తమ భూములను తమకు ఇవ్వడంలో అభ్యంతరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.తమ భూములను తమ పేరిట ఎక్కించుకునేందుకు ఏకంగా జాయింట్ కలెక్టర్ దాకా వెళ్లాలని చెప్పడం ఏమిటని మండిపడుతున్నారు. వీఆర్వో మొదలు జేసీ వరకూ ప్రతి అధికారికీ ఒక్కో ఫైల్‌ను తయారు చేయించి పంపడం రైతులకు సాధ్యమేనా అని అధికారులు ఆలోచించాలని సూచిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆ ఖాతాను తొలగించి, తమకు న్యాయం చేయాలని విన్నవిస్తున్నారు.

తిరిగి తిరిగి అలసిపోయాం..



మాకు వంశపారంపర్యంగా ఐదెకరాల భూమి సంక్రమించింది. మా తండ్రి చిక్కణ్ణ పేరుతో ఆ భూమి ఉండేది. ఆయన చనిపోయిన తర్వాత మా అమ్మ పేరిట నమోదు చేసుకోవాలని చూశాం. కానీ ఆ సర్వే నంబర్ టూ క్రోర్స్ ఖాతాలోకి పడింది. దీంతో అధికారులు మా అమ్మ పేరిట పాసుబుక్కు చేయడం లేదు. మా సొంత భూములను మా పేరిట మార్చుకునేందుకు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయాం.

- కలిబసి, రైతు, కణేకల్లు

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..



మా పెదనాన్న మేఘనాథ్‌కు సర్వే నంబర్ 726బీలో 5.56 ఎకరాల భూమి ఉంది. రెవెన్యూ రికార్డులో అది మిగులు భూమిగా చూపిస్తోంది. ఆ భూమికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ పత్రాలు మా వద్ద ఉన్నాయి. వాటిని రెవెన్యూ అధికారికి చూపించాం. భూమి మా పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించాలని నాలుగేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. టూ క్రోర్స్ ఖాతాలో పడ్డాయని, ఆన్‌లైన్ లాక్ అయిందని అంటున్నారు. సమస్యను పరిష్కరించలేదు.

- అంబ్రేష్, రైతు, కణేకల్లు

అన్ని ఆధారాలు ఇవ్వాలి..



టూ క్రోర్స్ ఖాతాలో పడ్డ రైతుల మిగులు భూములు వివరాల గురించి అన్ని ఆధారాలు మాకు సమర్పించాలి. క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్లు ఆ వివరాలను పరిశీలించి, మిగులు భూములు రైతులకు సంబంధించినవి నిర్ధారిస్తే.. రైతుల ఖాతాల్లోకి జమ చేస్తాం.

-ఫణికుమార్, తహసీల్దార్, కణేకల్లు

ఎలా భర్తీ చేస్తారో..?

- నోటిఫికేషన్ ఇస్తారా..? నామినేట్ చేస్తారా ?
- విద్యాశాఖ ఏఎస్ఓ పోస్టుకు తీవ్రపోటీ
- ఇప్పటికే పలువురి దరఖాస్తు
- నాగరాజు ఉత్తర్వులు రద్దు

అనంతపురం విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో గత కొంతకాలంగా వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఏఎస్ఓ పోస్టు మరోమారు చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఈ పోస్టులోకి వచ్చినట్లే వచ్చి వెనక్కు వెళ్లిపోయిన నాగరాజు విషయాన్ని అటుంచితే...తాజాగా మరికొందరు ఆ పోస్టు కోసం పోటీపడుతున్నారు. కొందరు ఎమ్మెల్యేల సిఫార్సులను నమ్ముకుంటే, మరికొందరు తమ విద్యార్హతలను నమ్ముకున్నారు. ఆ పోస్టుకు ముగ్గురు నలుగురు పోటీపడుతున్నట్టు సమాచారం. ఇటీవలే ఒక ఆర్డర్ ఇచ్చి , 24 గంటల్లోనే ఆ ఉత్తర్వులను అధికారులు రద్దు చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తీవ్ర పోటీ ఉన్న ఆ పోస్టును భర్తీ చేయడం కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో ఆ పోస్టును నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తారా? లేక నామినేటెడ్‌కు కేటాయిస్తారా అన్న చర్చ హాట్ హాట్‌గా నడుస్తోంది.

పోటా పోటీ

విద్యాశాఖలోని ఏఎస్ఓ పోస్టుకు పోటీ తీవ్రంగా ఉంది. ఈ పోస్టుకు శెట్టూరు మండలంలో పనిచేసే ఆనంద్ అనే టీచర్‌తోపాటు, బుక్కరాయసముద్రం మండలంలో పనిచేసే మరో టీచర్ శ్రీనివాసులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు మరో ఇద్దరు కూడా రేస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో కొందరికి అర్హతలున్నాయి. ఇటీవలి వరకూ అక్కడ ఏపీఓగా పనిచేసిన నాగరాజు ఆ ప్లేస్ నుంచి పక్కకు తప్పుకోవడంతో ఇతర ఆశావహుల్లో కొత్త ఆశ చిగురించింది. అప్పటి వరకూ స్తబ్ధుగా ఉన్న కొందరు ఉపాధ్యాయులు తామేం తక్కువకాదన్నట్లుగా ఇప్పుడు పైరవీలకు తెరలేపారు. మరికొందరు అర్హతలున్నాయి కదా ఒకసారి ప్రయత్నిస్తే పోయేదేముందని పోటీ పడుతున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలను, ఎంపీలను, ఇతర రాజకీయ నాయకుల అండదండలను, ఉపాధ్యాయ సంఘాల నాయకులను నమ్ముకుని బరిలో నిలిచారు. ఎవరికి వారు తమ బలాబలాలను నమ్ముకుని ప్రయత్నాలు చేస్తున్నారు.

సమగ్రశిక్షలో నోటిఫికేషన్ ద్వారా భర్తీ

సమగ్రశిక్ష ప్రాజెక్టులో సైతం ఖాళీ పోస్టుల భర్తీ తలనొప్పిగా మారడంతో అధికారులు నోటిఫికేషన్ మార్గాన్ని ఎంచుకున్నారు. ఇటీవల ఖాళీపడిన పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న 8 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఔత్సాహితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఇప్పుడు జిల్లా విద్యాశాఖలో కీలకంగా, తలనొప్పిగా మారిన ఏఎస్ఓ పోస్టుకు ఎందుకు ఆ తరహాలో ఆలోచించడం లేదన్న ప్రశ్న తలెత్తుతోంది. సమగ్రశిక్ష ప్రాజెక్టు తరహాలో ఏఎస్ఓ పోస్టుకు సైతం నోటిఫికేషన్ విడుదల చేసి, దరఖాస్తులు స్వీకరించి అర్హులను ఎంపిక చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అయితే కొందరు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల లెటర్లు పట్టుకుని ఇప్పటికే డీఈఓపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పారదర్శకంగా చేస్తారా? లేక పైరవీలకు తలొగ్గుతారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

నిరుద్యోగ సమస్య పరిష్కరించడం మా లక్ష్యం

రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మంత్రులకు సమస్యలు చెబుతున్న పారిశ్రామికవేత్తలు
7

పోలీసు స్టేషన్‌కు ప్రశ్నపత్రాలు

- గణితం పేపర్ లీక్‌తో విద్యాశాఖ అప్రమత్తం
- పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు
- స్టేషన్లలో భద్రపర్చాలని డీఈఓల ఉత్తర్వులు
- అనంత జిల్లాలోనే 1.09 లక్షల మంది విద్యార్థులు

6

న్యూస్‌బాక్స్

పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బాలగంగాధర్ తెలిపారు. సహకార సంఘం ద్వారా ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక ప్రయోజన వెసులుబాటు వంటివి కలుగుతాయన్నారు. ప్రతి ఐదుసంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన డైరెక్టర్లకు సంఘం నిర్వహణ బాధ్యతలు అప్పచెబుతున్నట్లు పేర్కొన్నారు. జనవరి 12న ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. ఆసక్తిగలవారు జనవరి 7నుంచి నామినేషన్లు దాఖలు చేయాలని కోరారు. 9న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందన్నారు. 12నిర్వహించే ఎన్నికల్లో సంఘ సభ్యులు పాల్గొని వారి ఓటును వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. వివరాలకు జిల్లా పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలోని ఉద్యోగుల పరపతి సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'గిరిజన టీచర్ల సమ్మెకు పరిష్కారం చూపాలి '

అనంతపురం విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉపాధ్యాయుల సమ్మెకు పరిష్కారం చూపాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ ప్రభుత్వాన్ని సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న గిరిజన టీచర్లు, అధ్యాపకులు 1659 మంది తమ డిమాండ్ల సాధనకు గత 31 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. టీచర్లు, అధ్యాపకుల సమ్మె మూలంగా గిరిజన గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అవుట్ సోర్సింగ్ వారిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ)లుగా పరిగణించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఆర్సీ 2022 మేరకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ-2024 నుంచి వీరు పనిచేస్తున్న పోస్టుల ఖాళీలను సైతం మినహాయించాలని కోరారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వీళ్లకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ లేఖ రాసినట్టు ఆయన స్పష్టం చేశారు.

రైల్వే ఉద్యోగులకు అవార్డులు

గుంతకల్లు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించిన ఐదుగురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీస్ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం జోనల్ హెడ్ క్వార్టర్సులో జీఎం అరుణ్ కుమార్ జైన్ సోమవారం జోన్ వ్యాప్తంగా 13 మంది ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. రైల్వే భద్రత విషయంగా అప్రమత్తతతో వ్యవహరించినందుకు గుంతకల్లు డివిజన్‌లో ఐదుగురికి, సికింద్రాబాద్ డివిజన్‌లో నలుగురికి, విజయవాడ డివిజన్‌లో ఇద్దరికి, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లో ఒక్కొక్కరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు.

తాడిపత్రికి చేరిన డ్రోన్ కెమెరా

తాడిపత్రి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్ కెమెరా తాడిపత్రికి చేరింది. పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా సాయంతో సోమవారం రెండు డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సమీపంలోని అక్కన్నపల్లి, యల్లనూరు రోడ్డు, పుట్లూరురోడ్డు, ఆటోనగర్, శివాయం వద్ద, సాయిబాబా ఆలయం వద్ద, బ్రిడ్జీ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను ఎగురవేశారు. వీటిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించిన డ్రోన్ కెమెరా

పొద్దు గూకిందా..?



పొద్దుతిరుగుడు పంట

కనుమరుగవుతున్న పొద్దు తిరుగుడు

భారీగా తగ్గిన పంట సాగు విస్తీర్ణం

బొమ్మనహాళ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్నేళ్ల కిందట ఎక్కడ చూసినా కనిపించిన పొద్దుతిరుగుడు పంట క్రమంగా కనుమరుగైంది. సాగు ఖర్చు తక్కువగా ఉండటం, దిగుబడి, లాభం అధికంగా ఉండటంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపేవారు. రాను రాను విత్తన నాణ్యత తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో కర్షకులు ఈ పంట సాగును వదిలేశారు. వేలాది ఎకరాల్లో సాగయ్యే పొద్దుతిరుగుడు పంట నేడు కనీసం వందల ఎకరాల్లో కూడా కనిపించడం లేదు.

వేల నుంచి పదుల ఎకరాల్లోకి సాగు

గతంలో ఖరీఫ్, రబీ సీజన్లో మండల వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను రైతులు సాగు చేసేవారు. మండలంలోని గోవిందవాడ, దర్గహొన్నూరు, బొల్లనగుడ్డం, బండూరు, కల్లుదేవానహళ్లి, హరేసముద్రం తదితర గ్రామాల్లో పొద్దుతిరుగుడు పంటను రైతులు ఎక్కువగా పండించేవారు. గత 15 ఏళ్ల నుంచి మండలంలో పొద్దుతిరుగుడు పంట సాగు రాను రాను తగ్గిపోయింది. ఈ సంవత్సరం మండలంలో కనీసం 20 ఎకరాల్లో కూడా పొద్దుతిరుగుడు పంట సాగు కాలేదు. రైతులు రబీలో వరికి బదులు పొద్దుతిరుగుడు పంట సాగు చేసేవారు.

దెబ్బతీసిన తెగుళ్లు

ప్రధానంగా పొద్దుతిరుగుడు పంట సాగును తెగుళ్ల దెబ్బ తీసినట్లు రైతులు చెబుతున్నారు. పంటకు వైరస్ సోకడంతో పూత రాలిపోతుంది. దీంతో ఆకులు విపరీతంగా ఎండిపోతూ మొక్క చనిపోతుంది. అదే తరుణంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర కూడా లభించలేదు. పొద్దు తిరుగుడు పంటను తక్కువ నీటి వనరులతో తక్కువ కాలపరిమితి గల పంటగా సాగుచేసే విధానంపై అధికారులు కూడా అవగాహన కల్పించకపోవడంత కూడా పంట సాగు తగ్గడానికి ప్రధాన కారణమని రైతులు అంటున్నారు. ప్రస్తుతం అనేక రకల పంటలకు దిగుబడి వచ్చేందుకు పలు రకాల రసాయనిక మందులు వచ్చాయి. పొద్దుతిరుగుడు పంట దిగుబడి కూడా బాగా రావడానికి మందులు ఉంటాయని, అధికారుల దృష్టి పెట్టి అవగాహన కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

గిట్టుబాటు ధరలేదు



పొద్దు తిరుగుడు సాగుకు ఖర్చు తక్కువ. అయితే దిగుబడి పడిపోవడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో పొద్దు తిరుగుడు సాగు చేయడం లేదు. మా గ్రామ శివారులో ఎక్కువగా పొద్దు తిరుగుడు పంట సాగు చేసేవారు. ప్రస్తుతం వరిపంట సాగు ఎక్కువగా సాగుచేస్తున్నారు. పొద్దుతిరుగుడు సాగుకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి ప్రభుత్వం ప్రోత్సహిస్తే రైతులు ముందుకొస్తారు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

సాగును ప్రోత్సహించాలి



పొద్దుతిరుగుడు లాభదాయకంగా ఉండే పంట. అయితే సాగు చేసేందుకు రైతు ఆసక్తి చూపడంలేదు. విత్తనాలు నాణ్యత లేకపోవడం వల్లే పొద్దుతిరుగుడు పంట పండించడం లేదు. అధికారులు శ్రద్ధ చూపి నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే సబ్సిడీతో పంపిణీ చేసి సాగుకు ప్రోత్సహించాలి. పొద్దుతిరుగుడు పంట సాగు తక్కువ కావడంతోనే ఆయిల్ ధరలు పెరిగిపోతున్నాయి.

-ఆంజనేయులు, రైతు, దేవగిరి

విత్తనాలు రావడంలేదు



మార్కెట్లోకి నాణ్యమైన పొద్దుతిరుగుడు విత్తనాలు రావడం లేదు. మార్కెట్లో దొరికిన విత్తనాలను సాగుచేస్తే దిగుబడి రాదు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలో లేదు. వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినా గిట్టుబాటు కావడం లేదు. మార్కెట్లో నాణ్యమైన విత్తనాలు వస్తే ఖరీఫ్ సీజన్ తర్వాత రబీలో సాగుకు మంచి అవకాశం ఉంటుంది.

- జనార్దనపల్లి రామాంజనేయులు, రైతు, ఉద్దేహాళ్

వైరస్‌తోనే సాగు తగ్గింది



పొద్దు తిరుగుడు పంటను గతంలో రైతులు ఎక్కువగా సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం రైతులు ఆ పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. బట్‌నెక్రోసిస్ వైరస్‌తో పొద్దు తిరుగుడు పంట దిగుబడి తగ్గింది. ఈ వైరస్ ప్రభావంతో మొక్కలు చనిపోతాయి. అందుకే రైతులు పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 50 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట సాగు చేశారు.

- సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

పోలీసు స్టేషన్‌కు ప్రశ్నపత్రాలు

గణితం పేపర్ లీక్‌తో విద్యాశాఖ అప్రమత్తం

పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు

స్టేషన్లలో భద్రపరచాలని డీఈఓల ఉత్తర్వులు



ఇటుకలపల్లి పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్న మన్నీల పాఠశాల ఉపాధ్యాయులు

అనంతపురం విద్య/యాడికి/ కొత్తచెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గణితం పేపరు లీక్ కావడంతో మంగళవారం నుంచి నిర్వహించాల్సిన సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6నుంచి 10వ తరగతులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఈనెల 11నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు తెలుగు, హిందీ, ఇంగ్లిషు పరీక్షలు నిర్వహించారు. సోమవారం గణితం పరీక్ష నిర్వహించాల్సి ఉంది. సోషల్‌మీడియా (యూట్యూబ్)లో గణితం పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడంతో సోమవారం నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేశారు. ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి సోమవారం సాయంత్రం ఆదేశాలు రావడంతో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంతా సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1 ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్టేషన్లలో భద్రపరిచారు. ఉమ్మడి జిల్లాల డీఈఓలు కూడా ప్రధానోపాధ్యాయులందరూ ప్రశ్నపత్రాలను స్టేషన్లలో భద్రపర్చాలని సోమవారం ఆదేశాలిచ్చారు. అనంత డీసీఈబీ కార్యదర్శి గంధంనేని శ్రీనివాసులు ప్రశ్నపత్రాల భద్రతపై జిల్లా ఎస్పీని కలిసి లేఖ ఇచ్చారు. జిల్లాలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ 1.09 లక్షల మంది ఎస్‌ఏ-1 పరీక్షలు రాస్తున్నారు.

గణితం పేపర్ లీక్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రైమరీ పరీక్షలు పూర్తయ్యాయి. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ పరీక్షలు జరుగుతున్నాయి. సోమవారం గణితం ప్రశ్నపత్రం లీక్ కావడంతో విద్యాశాఖ రాష్ట్ర అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆగమేఘాల మీద ఈ రోజు జరగాల్సిన గణితం పరీక్షను వాయిదా వేశారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని జిల్లాలోని డీఈఓలు, డీసీఈబీ కార్యదర్శులు అప్రమత్తం అయ్యారు. ప్రశ్నపత్రాలు ఉన్న కాంప్లెక్స్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు వెంటనే స్థానిక పోలీస్టేషన్లలో వాటిని భద్రపర్చాలని డీఈఓ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 10 వరకూ సుమారు 1.09 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 6వ తరగతిలో 23,500 మంది, 7వ తరగతిలో 22,200 మంది, 8వ తరగతిలో 22,700 మంది, 9వ తరగతిలో 21,300 మంది, 10వ తరగతిలో 20,100 మంది చదువుతున్నారు. గణితం, సైన్స్, సోషల్ పరీక్షలు జరగాల్సిన సమయంలో పేపర్ లీక్ కావడంతో గణితం పరీక్ష వాయిదా పడింది. ప్రస్తుతం సైన్స్, సోషల్ పరీక్షల ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్టేషన్లలో భద్రపరుస్తున్నారు.



బ్రహ్మసముద్రం జడ్పీ స్కూల్ ప్రశ్నపత్రాలున్న పెట్టెకు సీల్ వేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చిన దృశ్యం

గతంలో ఇష్టారాజ్యం

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి రోజూ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యేవి. అయినా వాటిని పట్టించుకోకుండా అలాగే పరీక్షలు నిర్వహించి మమ అనిపించేవారు. గత మూడు, నాలుగేళ్ల ఇదే తంతు జరిగింది. ముఖ్యంగా ఎస్‌సీఈఆర్టీలోని ఓ ఉన్నతాధికారి వైఖరి వల్లే ఇదంతా జరిగిందంటూ అప్పట్లో ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. విద్యావ్యవస్థలను ఆయన సర్వనాశనం చేశారంటూ పెదవి విరుస్తూ వచ్చారు. అయితే తాజాగా గణితం పేపర్ లీక్ అయిన విషయం తెలియగానే ఎస్‌సీఈఆర్టీ, కమిషనర్ వెంటనే అప్రమత్తం అయ్యారు. గణితం పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో డీఈఓ, డీసీఈబీ కార్యదర్శి ఆదేశాలతో కాంప్లెక్స్ స్కూళ్ల హెచ్‌ఎంలు పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తుండటంపై నగటు ఉపాధ్యాయుడు, సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాజీలేని పోరాటం వల్లే గెలుపు

మజ్దూర్ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు



మాట్లాడుతున్న సీహెచ్ శంకర్రావు

గుంతకల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కారంలో రాజీలేని పోరాటాల వల్లే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు పేర్కొన్నారు. రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో మొదటి స్థానంలో గెలుపొందడంపై డివిజనల్ కేంద్రంలో సోమవారం ఉదయం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయం నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో శంకర్రావు మాట్లాడుతూ సమస్యలపై చిత్తశుద్ధితో పోరా టాలు చేసి ఉద్యోగుల నమ్మకాన్ని నిలుపుకున్నందుకే ఎన్నికల్లో యూనియన్‌కు ప్రథమ స్థానం దక్కిందన్నారు. ఎనిమిదో వేతన సవరణ సంఘ నియామకం కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. జనవరి 2026కి 8వ పీఆర్సీ సిఫారసులు అమలయ్యేలా పోరాడటమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి ఉదయ భాస్కర రావు, గుంతకల్లు డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, ఏడీఎస్‌లు నారాయణ, మధుసూదన్, అశ్విని, జోనల్ కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఎం శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగుల సంఘ డివిజనల్ నాయకుడు మస్తాన్ వలి, యూనియన్ బ్రాంచ్ కేఎస్ శేఖర్, బాబు, ఎస్‌ఎం బాషా, రాజశేఖర్, కే రాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఆపరేషన్

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

కోతలేకుండా కణతి తొలగింపు



బాధితురాలితో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డాక్టర్లు

అనంతపురం టౌన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి న్యూరో సర్జన్లు భాస్కర్, రవితేజ, భాస్కరబాబు, అచ్యుత్ సోమవారం వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన సుజాతాబాయి తీవ్ర తలనొప్పి, చూపు తగ్గడంతో ఇబ్బంది పడేవారు. ఆమెను కుటుంబ సభ్యులు స్విమ్స్ న్యూరోసర్జన్ వద్దకు తీసికెళ్లి చూపించారు. అక్కడ పరీక్షలు చేసిన డాక్టర్లు సుజాతాబాయికి పిట్యూటరీ ట్యూమర్ ఉందని నిర్ధారించి ఆపరేషన్ చేయాలన్నారు. అక్కడ ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో అంతడబ్బు వ్యయం చేసే స్తోమత లేక తిరిగి వచ్చేశారు. ఈక్రమంలోనే నవంబరు 21న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ న్యూరో డాక్టర్లకు చూపించి, గతంలో జరిగిన విషయాలన్ని వివరించారు. దీంతో ఆస్పత్రి న్యూరో విభాగం డాక్టర్లు ఆ కేసును సవాలుగా తీసుకొని ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఆపరేషన్ చేస్తామని కుటుంబసభ్యులకు తెలిపారు. వారి అంగీకారంతో ఈనెల 10న ఆమెకు ఎలాంటి కోతలు లేకుం డా ఎండోస్కోప్, మైక్రోస్కోప్ ఉపయోగించి ఆపరేషన్ చేశారు. ఈఆపరేషన్ విజయవంతం కావడంతో సుజాతాబాయి ఆరోగ్యంగా కోలుకున్నారు. అరుదైన ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌వెంకటేశ్వరరావు, సూపర్‌స్పెషాలిటీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు. కార్యక్రమంలో అనస్తీషియా డాక్టరు శ్రీహరితోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నల్లతామరకు చెక్ పెట్టండి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మిరప పంటను కొత్తగా ఆశిస్తున్న నల్లతామర పురుగు నియంత్రణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జేసీ శివ్‌నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మలతో కలిసి కలెక్టర్ నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపే కరపత్రాలను సోమవారం ఆవిష్క రించారు. ఈ కరపత్రాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందజేసి , నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సామాజిక స్పృహతో రచనలు అభినందనీయం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం విద్య, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సామాజిక స్పృహతో కూడిన రచనలు చేయడం అభినందనీయమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ భవన్‌లోని చాంబర్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత జూటూరు తులసీదాసు రచించిన కాకులు దూరని కారడివి కథా సంపుటాన్ని కలెక్టర్, డీఈఓ ప్రసాద్‌బాబు, రచయిత తులసీదాస్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల మనస్సుకు హత్తుకునేలా సరళమైన పదాలతో కథలు రాయడం బాగుందన్నారు. బాల్యంలో పిల్లలకు నీతిని కథల రూపంలో బోధించడం మంచి ఆలోచనన్నారు. చదువుపై ఆసక్తిని పెంచేలా కథలు ప్రేరణ కలిగించేలా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి గంధంనేని శ్రీనివాసులు, ఎస్‌ఎస్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద, సమగ్రశిక్ష ఉద్యోగి గోపాల్, ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

896 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇఫ్‌కో కంపెనీకి చెందిన 896 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 514 మెట్రిక్ టన్నులు డీఏపీ, 382 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం ఎరువులు ఉన్నాయని వెల్లడించారు.

జేఎన్‌టీయూ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొన్ని వారాల కిందట ఉద్యోగ విరమణ పొందిన జేఎన్‌టీయూ ఉద్యోగులకు మొత్తం ఆర్థిక ప్రయోజనాలు చెల్లించారు. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల(అడహక్)కు వేతన బకాయిలు చెల్లించారు. అందుకు కృతజ్ఞతగా సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ల (అడ్‌హక్) అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్టయ్యను వేర్వేరుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని ఉద్యోగ, సిబ్బందికి నెల వేతనమే జీవనాధారమన్నారు. గతంలో వారిని విభజించి వైషమ్యాలు సృష్టించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో అలాంటివాటికి చోటులేకుండా ప్రతి ఉద్యోగికి దక్కాల్సిన అన్ని ప్రయోజనాలను చెల్లించేలా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.



వీసీ సుదర్శనరావును సన్మానిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

సమస్యలపై నేరుగా సంప్రదించండి

- డీఆర్‌ఎం విజయకుమార్



పెన్షన్ అదాలత్‌లో మాట్లాడుతున్న డీఆర్‌ఎం విజయకుమార్

గుంతకల్లు, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): రైల్వే విశ్రాంత ఉద్యోగులకు ఏవైనా జటిల సమస్యలుంటే తనతో నేరుగా సంప్రదించవచ్చని డీఆర్‌ఎం విజయ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ఉదయం రైల్వే పెన్షన్ అదాలత్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌ఎం మాట్లాడుతూ రైల్వే రిటైర్డు ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారం కోసం పెన్షన్ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే తనను నేరుగా కలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ క్యాపిల్ అరోరా, ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి సుంకప్ప, పీపీఆర్ డివిజనల్ అధ్యక్షుడు పీవీవీ ప్రసాద రావు, కార్యదర్శి రంగస్వామి, ఏఐఆర్‌ఎఫ్ డివిజనల్ ఉపాధ్యక్షుడు కళాధర్ పాల్గొన్నారు.



చిక్కేపల్లి వద్ద గుంతలు పడిన రోడ్డు



యాడికి సమీపాన అధ్వానంగా రోడ్డు

ఎటు వెళ్లినా గుంతలే..!

అధ్వానంగా యాడికి-బుగ్గ రోడ్డు

యాడికి-రాయలచెరువు రోడ్డు దుస్థితీ అంతే..

కిందపడి గాయపడుతున్న వాహనదారులు

యాడికి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఇటు వెళ్తే గుంత... అటు వెళ్లినా గుంతే. దీంతో ఎటు వైపు వెళ్లాలో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం నుంచి బుగ్గకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పై అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు తప్పించుకునే క్రమంలో వాహనాలు కిందపడి తీవ్రంగా గాయపడుతున్నారు. ఇటీవల బండలను తరలిస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై గుంతలను తప్పించబోయి బోల్తాపడింది. అలాగే ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి పడటంతో యాడికికి చెందిన ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అయినా రోడ్డు మరమ్మతులు గురించి పట్టించుకొనే వారు కరువయ్యారని వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. యాడికి నుంచి రాయలచెరువుకు వెళ్లే రోడ్డు కూడా గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకొనే వారే లేరని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకేమి పట్టదు అన్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారుల చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు చేపట్టి యాడికి-బుగ్గ, యాడికి- రాయలచెరువు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ఆత్మవిశ్వాసంతోనే క్రీడల్లో విజయం

- ఎస్కేయూ వీసీ అనిత


క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించాలంటే ఆత్మవిశ్వాసం ముఖ్యమని ఎస్కేయూ వీసీ అనిత పేర్కొన్నారు. వర్సిటీ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల ప్రారంభోత్సవం సోమవారం స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ఎస్కేయూ వీసీ అనిత మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే ప్రాతినిధ్యం ముఖ్యమన్నారు. అనంతరం ఆర్డీటీ స్టేడియంలో ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో ధర్మవరం డిగ్రీ కాలేజ్‌పై అనంతపురం ఎస్వీ డిగ్రీ కళాశాల జట్టు, ఎస్కేయూ కాలేజీపై వాణి డిగ్రీ కాలేజీ జట్లు గెలుపొందాయి.

జాతీయ చాంపియన్‌షిప్ అనంత కైవసం


చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న జిల్లా పారా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను జిల్లా వాసులు కైవసం చేసుకున్నారు. గుజరాత్‌లోని నదియాడ్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి అంధుల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఏపీ తరఫున జిల్లాకు చెందిన నీలం సంజయ్‌రెడ్డి, షేక్ మహ్మద్‌షరీఫ్, నీలం పల్లవి, బలరాం, అనిల్‌కుమార్ ప్రాతినిధ్యం వహించారు. టీం చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచారు. దీంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు జిల్లా వాసులు..


నందీశ్వరి, సాలమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని గురుకాశిలో ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ యూనివర్సిటీల బాక్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన దివ్యనందీశ్వరి, సాలమ్మ ఎంపికయ్యారు. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న వీరు ఎంపిక కావడం పట్ల డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, శాప్ కోచ్ ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పీడీ శ్రీరామ్ అభినందనలు తెలిపారు.

చీనీ టన్ను రూ.27,650

అనంతపురం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.27,650 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడు పోయినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 27టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వేతనాలు పెంచాలని మహిళా కార్మికుల ధర్నా

గోరంట్ల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతపల్లి వద్దగల గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళలు వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. మహిళాకార్మికులు విధులు బహిష్కరించి, పరిశ్రమ ముందు ఉదయంనుంచి బైఠాయించారు. దినసరి వేతనం రూ.350 చెల్లిస్తుండగా ఇటీవల ఆందోళన చేయడంతో కేవలం రూ.5 పెంచారన్నారు. రోజూ పరిశ్రమకు వచ్చి, వెళ్లడానికి బస్సు ఏర్పాటు చేసినా, నెలకు రూ.1200 వసూలు చేస్తున్నారని వాపోయారు. వేతనాలు పెంచడంతోపాటు రవాణా చార్జీలు యజమాన్యమే భరించాలని డిమాండ్ చేశా రు. హెచ్‌ఆర్ వేణుగోపాల్, డీజీఎం సురేష్.. ఆందోళనకారుల వద్దకెళ్లి చర్చించారు. సమస్యలను యజామన్యం దృష్టికి తీసుకెళ్తామనీ, విధుల్లోకి రావాలని కోరారు. కార్మికులు సమస్య తేలే వరకు ఆందోళన విరమించేదిలేదని సమీపంలోని పుట్టపర్తి ప్రధాన రహదారిపై బైఠాయించారు. గంట తరువాత బెంగళూరు నుంచి గార్మెంట్స్ పరిశ్రమ ప్రతినిధులు మహదేవ్ గౌడ్, దినేష్ వచ్చి, వారితో చర్చించారు. వేతనం పెంపుపై యజమాన్యంతో చర్చిస్తామనీ, కొంత సమయం ఇవ్వాలని కోరడంతో వారు శాంతించి, మధ్యాహ్నం నుంచి విధులకు వెళ్లారు.


గార్మెంట్స్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

- నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే లక్ష్యం
- సెర్ప్, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఎంఎస్ఎంఈ, సెర్ప్ సమీక్షలో మంత్రులు

పెనుకొండ టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ఎంఎస్ఎంఈ సెర్ప్ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఏపీఐఐసీ జెడ్ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, బ్యాంకర్లు, వారి సమస్యలు సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమలో పరిశ్రమల అభివృద్ధి కోసం మొట్టమొదటి సమీక్షా సమావేశం ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి, నూతన పరిశ్రమలు ప్రోత్సహించేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే ఎంఎస్ఎంఈ సమస్యలు మాదృష్టికి వచ్చాయని వాటన్నింటిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఆటోమొబైల్, చేనేత పరిశ్రమలు అధికంగా ఉన్నాయన్నారు. ఇవికాకుండా కొత్త తరహాలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అనువుగా ఉంటుందో, ఇందులో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏమాత్రం లభిస్తాయో అధ్యయనం చేస్తున్నామన్నారు. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

ఒక్కొక్కటి సరిచేస్తున్నాం: మంత్రి సవిత



మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, ఒక్కొక్కటే సరి చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఇప్పటికే ఏ ప్రాంతంలో ఏ పరిశ్రమలు తీసుకురావాలో ఇండస్ట్రీయల్ అధికారులతో సర్వే చేసినట్లు తెలిపారు. త్వరలో నూతన ఇండస్ట్రీ యాజమాన్యానికి పూర్తి సహకారం ఇచ్చి బ్యాంక్ యాజమాన్యంతో రుణాలు అందేలా కృషిచేస్తామన్నారు. ఇందుకుగాను సీఎం చంద్రబాబు సమక్షంలో చర్చలు జరిపి కొత్త పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లె సింధూర, ఎంఎస్ రాజు, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరాములు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఉమ్మడి జిల్లాల బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

కక్షపూరిత రాజకీయాలు చేయం



వైసీపీ ప్రభుత్వంలో మాదిరి కక్షపూరిత రాజకీయాలు చేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆయనకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనర్హులను తొలగించి అర్హులకు పెన్షన్ ఇవ్వడమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ పరిధివరకు పెన్షన్ సమస్యలను టీడీపీ శ్రేణులు తీసుకొస్తున్నాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని అభివృద్ధి ఈ ఐదు నెలల్లోనే చేసి చూపించామన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ తొలిసారిగా ఎమ్మెల్యేలు అయినవారిలో 17మందికి మంత్రి పదవులు అప్పజెప్పారని, అందులో తామిద్దరం కూడా ఉన్నామని, బాధ్యతగా పనిచేస్తున్నట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తే పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుందో స్థానిక స్థితిగతులను అధికారులతో ఆరాతీసి ముఖ్యమంత్రికి తెలియజేస్తామన్నారు.

బ్యాంక్ రుణాలు ఇవ్వాలి



ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం షూరిటీలేని రుణాలు, క్రెడిట్ గ్యారెంటీలేని రుణాలు అందివ్వాలి. ఉమ్మడి జిల్లాలో ఒకశాతం ఎన్‌పీఏ కూడా లేకపోయిన రుణాలు విరివిగా ఇవ్వడం లేదు. ఎంఎస్ఎంఈలపై అధికారుల దాడులు ఆపి, సమన్వయంతో మా సమస్యలు పరిష్కరించాలి. మూడు లక్షలు జనాభా ఉన్న ప్రాంతాల్లో డిమార్ట్ వంటి సంస్థలకు అవకాశాలు ప్రభుత్వం ఇవ్వకూడదు. వాటి టర్నోవర్ ఇతర రాష్ట్రాలకు వెళ్తోంది. అంతేకాకుండా చిరువ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-బైసాని రాంప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు

అహుడా నుంచి తీవ్ర ఇబ్బందులు



అహుడా లైసెన్స్ పరిధి నుంచి తొలగించి ఎంఎస్ఎంఈలను ఆదుకోవాలి. గతంలో మాదిరి పంచాయతీ, మునిసిపాలిటీ అనుమతిచ్చేలా చేస్తే ఒక్కో ఎంఎస్ఎంఈలకు దాదాపు రూ.20లక్షలు ఆదా అవుతుంది. అలాగే విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. చార్జీలు తగ్గిస్తే మరింత ఊరట ఇచ్చినట్లు అవుతుంది. బ్యాంక్ యాజమాన్యం రుణ మంజూరులో ప్రాపర్టీ షూరిటీ అడగకుండా రుణాలు ఇవ్వాలి. మన రాష్ట్రంలో తయారు చేసిన వస్తువులు ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాల వస్తువులు నిషేధించాలి. అప్పుడే పూర్తి న్యాయం జరుగుతుంది.

-శేషాంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు

ధర్మవరంలో మహిళా పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు పరిటాల శ్రీరామ్ వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మహిళా పారిశ్రామిక వాడ, స్టిచ్చింగ్ యూనిట్ ఏర్పాటు చేసి, ఆర్థికంగా చితికిపోయిన చేనేత కుటుంబాలకు ఉపాధి కల్పించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్.. పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితకు విజ్ఞప్తిచేశారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం పెనుకొండకు వచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను పరిటాల శ్రీరామ్ కలిసి, ధర్మవరం ప్రాంతంలో చేనేతలు పడుతున్న కష్టాలను వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ధర్మవరం చేనేత రంగం కొన్నేళ్లుగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. ముడిసరుకుల ధరలు పెరిగి, గిట్టుబాటు ధరలు దక్కక చేనేత రంగం కుదేలైందన్నారు. ధర్మవరం పట్టణంలోనే 50 వేల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయన్నారు. చేనేత వృత్తిలో కీలకంగా ఉన్న మహిళలకు ప్రస్తుతం ఉపాధి లేకుండాపోయిందన్నారు. వారు ఆర్థిక సాయం అడగకుండా తమకు ఉపాధి చూపించాలని కోరుతున్నారని పరిటాల శ్రీరామ్.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 20వేల మందికిపైగా మహిళలకు ఉపాధి కల్పించే దిశగా వారికి ప్రత్యేకంగా పారిశ్రామిక వాడ, స్టిచ్చింగ్ యూనిట్ ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబునాయుడుతో చర్చిస్తానని పరిటాల శ్రీరామ్‌కు తెలిపారు.

ప్రాణంతీసిన వివాహేతర బంధం

- కాంట్రాక్టర్ హత్య కేసు ఛేదింపు... ఆరుగురి అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నల్లమాడకు చెందిన కాంట్రాక్టర్ బశెట్టి రాజశేఖర్ (49) హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసు విచారణలో తేలింది. ఈ కేసులో పెనుకొండ సమీపంలోని వెంకటగిరిపాలెం గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి, అతడి భార్య రాధిక, వారి బంధువులు ఏపీఎస్పీ కానిస్టేబుల్ సాయినాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, సోమందేపల్లికి చెందిన వెంకటేష్, నరేష్‌ను అరెస్టు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. కొత్తచెరువు మండలంలోని మైలేపల్లి విజయ్‌కుమార్ ఫాంహౌస్‌లో రాజశేఖర్ ఉంటుండేవాడు. గతంలో పెనుకొండ సమీపంలోని వెంకటగిరిపాలెంలో విద్యుత్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తుండేవాడు. ఆ సమయంలో అదే గ్రామంలో రాధిక హోటల్ నిర్వహిస్తుండేది. రాజశేఖర్.. కూలీల టిఫిన్లు, భోజనాలు కోసమని హోటల్‌కు వెళ్తుండేవాడు. అలా రాధికతో పరిచయం ఏర్పడింది. అది కాస్తా.. వివాహేతర బంధానికి తెరతీసింది. విషయం రాధిక భర్త రవీంద్రరెడ్డికి తెలిసింది. దీంతో అతడితోపాటు అతడి బావమరిది సాయినాథరెడ్డి (ఏపీఎస్పీ కానిస్టేబుల్).. పద్ధతి మార్చుకోవాలని రాజశేఖర్‌ను మందలించారు. అయినా అతడు మారలేదు. దీంతో రవీంద్రారెడ్డి, సాయినాథరెడ్డి, బంధువు అనిల్‌కుమార్‌రెడ్డి (సోమందేపల్లి), అతడి స్నేహితులు సోమందేపల్లికి చెందిన వెంకటేష్, నరేష్‌తో కలసి రాజశేఖర్‌ను కిడ్నాప్‌చేసి, హత్య చేయాలని పథకం వేశారు. ఆ మేరకు ఈనెల 11న సాయినాథరెడ్డికి చెందిన కారులో మైలేపల్లి విజయ్‌కుమార్ ఫాంహౌస్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న రాజశేఖర్‌పై ఇనుపరాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడిచేశారు. అతడిని కారులో వేసుకుని అమిదాలకుంట, సీకేపల్లి మీదుగా వెంకటగిరిపాలెం చేరుకున్నారు. అక్కడ రాధికతో చెప్పుతో కొట్టించారు. రాజశేఖర్‌ను అక్కడి నుంచి కొట్టుకుంటూ తీసుకొచ్చి, మైలేపల్లి ఫాంహౌస్‌లో పడేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ చనిపోయాడు. అతడి భార్య స్వర్ణకుమారి ఫిర్యాదు మేరకు కొత్తచెరువు అప్‌గ్రేడ్ సీఐ ఇందిర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సిబ్బందితో కలిసి సోమవారం మధ్యాహ్నం మరకుంటపల్లి వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

పెద్దపప్పూరు/చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు, చెన్నేకొత్తపల్లి మండలాల్లో వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ఆటోలు బోల్తా పడటంతో ఇద్దరు మరణించారు. పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగుపల్లి టోల్‌గేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. మద్ది చిన్నరాయుడు (48), నరసింహుడు గుత్తి మండలం కొత్తపేట సమీపాన గల కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో పనిచేసేవారు. వీరు సోమవారం తాడిపత్రి వైపు నుంచి గుత్తి మండలం కొత్తకోట దగ్గర ఉన్న కాశిరెడ్డి నాయన గుడి ఆటోలో బయలుదేరారు. ఆ ఆటో చీమలవాగుపల్లి టోల్‌గేట్ సమీపంలో బోల్తా పడటంతో మద్ది చిన్నరాయుడు అక్కడికక్కడే మరణించాడు. నరసింహుడు స్వల్పంగా గాయపడ్డాడు. చిన్నరాయుడు మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే గాయపడ్డ నరసింహుడిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేస్తామన్నారు.


చిన్నరాయుడు మృతదేహం

చెన్నేకొత్తపల్లి మండలంలోని దామాజిపల్లి సమీపంలో సోమవారం ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మరణించాడు. న్యామద్దల గ్రామానికి చెందిన ముత్యాలప్ప(45), తన భార్య రమాదేవి, కుమార్తె లాస్యలతతో కలిసి తనసొంత ఆటోలో ధర్మవరం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. దామాజిపల్లి సమీపంలోకి రాగానే కుక్క ఆటోకు అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటో ముత్యాలప్ప మీద పడటంతో తీవ్రం గా గాయపడ్డాడు. భార్య, కుమార్తె కూడా స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ముత్యాలప్ప మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ముత్యాలప్పకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


ముత్యాలప్ప మృతదేహం

శేషజీవితం సంఘ సేవలో...

- రిటైర్డ్ ఉద్యోగులకు అండగా కదిరి తాలూకా పెన్షనర్ల సంఘం
- ప్రయోజనాల సాధనకు పాటుపడుతున్న వైనం
- నేడు పెన్షనర్ల దినోత్సవం

కదిరి అర్బన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం నుంచి రిటైర్ అయిపోయామనీ, వయసు అయిపోయిందని అలసిపోలేదు. సేవలకు స్వస్తి చెప్పలేదు. తమ ఉద్యోగ జీవితానుభవంతో సంఘ శ్రేయస్సుకు పాటు పడుతున్నారు. వారే కదిరి తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు. యువకులు, యువజన సంఘాలతో పోటీపడుతూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2019 డిసెంబరు 19న ఏర్పాటైన ఈ సంఘం అనేక సేవాకార్యక్రమాలు చేపడుతోంది.

సేవాకార్యక్రమాల్లో..

ఉద్యోగ విరమణ చేసిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు సంఘంగా ఏర్పడ్డారు. మొదట వందమంది సభ్యులతో ఏర్పాటైన సంఘం ప్రస్తుతం 1100 మందికి చేరుకుంది. సంఘ సేవలో భాగంగా ప్రధాన కార్యదర్శి ఆత్మారెడ్డి పర్యవేక్షణలో పలువురు కార్యవర్గ సభ్యులు వివిధ కార్యక్రమాలు చేస్తున్నారు. అందులో భాగంగా పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ల కోసం సబ్‌ట్రెజరీకి సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాల ఇప్పించడం, రీయింబర్సుమెంటు ప్రతిపాదనలు పంపడం, మృతిచెందిన పెన్షనర్ల కుటుంబాలకు పెన్షన్ వచ్చేందుకు ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికలు ఇవ్వడం, వయసు ప్రాతిపదికన పెరిగే పెన్షనర్లకు ప్రతిపాదనల తయారీ వంటి కార్యక్రమాలు దగ్గరుండి చేస్తుంటారు. ప్రతి ఏటా జనరల్, కంటి, కీళ్ల తదితర ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ పర్వదినాలు, జాతీయ పండుగలు, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.


సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్)

పెన్షనర్స్ డే నేపథ్యం

ఆంగ్లేయుల పాలనలో ఉద్యోగికి సంపూర్ణమైన హక్కులుండేవికావు. హక్కులు పరిమితంగా ఉండటంతో వారి ఐక్యత కూడా అత్యల్పంగా ఉండేది. ఉద్యోగ విరమణ తరువాత పెన్షన్ అత్యల్పంగా ఉండేది. 1889లో పింఛన్ విధానం ప్రారంభమైనప్పటికి అది నామమాత్రగానే ఉండేది. 1920 బ్రిటిష్ కాలంలో రిటైర్డ్ బెనిఫిట్ పెన్షన్ ప్రవేశపెట్టారు. ఢిల్లీ మిలటరీ అధికారి డీఎస్ నకారా పెన్షన్ కోసం పోరాటాన్ని దశవారిగా చేశారు. పెన్షన్‌ను రాజ్యాంగ బద్ధమైన హక్కుగా గుర్తించాలంటూ న్యాయపోరాటం చేశారు. 1980 దశకంలో పలు పోరాటాలు చేయడంతో ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980 అమలులోకి వచ్చాయి. 1981లో కుటుంబ పెన్షన్‌ను అమలు చేశారు. 1982 డిసెంబరు 17న సుప్రీంకోర్టు న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ తీర్పు చెప్పారు. నాటి నుంచి జాతీయ స్థాయిలో పెన్షనర్స్ డే నిర్వహిస్తున్నారు. ఆ తీర్పు నేడు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. తీర్పువచ్చిన రోజున పెన్షనర్ల దినోత్సవంగా 1983నుంచి చేసుకుంటున్నారు.

నేడు సీనియర్ పెన్షనర్లకు సన్మానం

పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా 75ఏళ్లు పైబడిన పెన్షనర్లును సత్కరించనున్నారు. సంఘం భవనంలో మంగళవారం ఉదయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఒకరికొకరు తోడుగా...



ఒకరికొకరు తోడుగా సమష్టి కృషితో ఏర్పాటు చేసుకున్న సంఘమే ఇది. రిటైర్డ్ అనే పదం వినగానే ప్రతిఒక్కరిని అదో రకమైన భయం వెంటాడుతుంది. వృద్ధాప్యం మీదపడటంతో కొంతమంది కుటుంబ సభ్యుల నుంచే చులకనగా చూడబడారు. మరికొంతమంది కుటుంబాలకే భారమవుతారు. ఎవరికి ఎలాంటి సాయం చేయడానికైనా సంఘం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది. ఇదే పెన్షనర్లలో ధైర్యం నింపుతోంది. అధ్యక్షుడిగా ప్రతి పనిని భారంగా కాకుండా ఒక బాధ్యతగా చేస్తున్నా.

-శివారెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు

మానసిక సంతృప్తి



ఈ సంఘం ద్వారా అందిస్తున్న సేవలతో ఎంతో మానసిక సంతృప్తి కలుగుతోంది. ఇప్పటికే ఎన్నోసేవా కార్యక్రమాలు నిర్వహించాం. రోజురోజుకు మారుతున్న పెన్షన్ నిబంధనలను అధ్యయనం చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్నవారి ప్రయోజనాల కోసం సూచనలు, సలహాలు ఇస్తున్నాం. సంఘం తరఫున రిటైర్డ్ ఉద్యోగికి ప్రయోజనాలు సకాలంలో వచ్చేలా కృషి చేస్తున్నాం. ఈసంఘంలో వివిధ శాఖల రిటైర్డ్ ఉద్యోగులు దాదాపు 11వందల మంది ఉన్నారు. వారందరికీ సంఘం అండగా నిలుస్తుంది.

-ఆత్మారెడ్డి, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి

సంక్షిప్తం

నేడు రెవెన్యూ సదస్సు

అనంతపురం రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అర్బన్ పరిధిలోని నారాయణపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామస్థులు రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా రూరల్ పరిధిలో ఉదయం తాటిచెర్ల గ్రామం, మధ్యాహ్నం సోములదొడ్డి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మంజునాథ్ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన నగర కమిషనర్

అనంతపురం క్రైం,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్‌గా రామలింగేశ్వర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఉన్న కమిషనర్ నాగరాజు దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిన విషయం తెలిసిందే. ఆయనకు అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విరాళం


విరాళం ఇస్తున్న రామసుబ్బయ్య, సంజీవరాయుడు

అనంతపురం అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ పరిధిలో టీడీపీ సానుభూతి పరులైన పేదలకు ఉచితంగా పార్టీ సభ్యత్వం చేయించేందుకు 49వ డివిజన్ టీడీపీ నాయకులు రామసుబ్బయ్య, సంజీవరాయుడు రూ.50వేలు విరాళం అందజేశారు. టీడీపీ స్థానిక అర్బన్ కార్యాలయంలో సోమవారం పార్టీ రాష్ట్ర నాయకుడు గంగారామ్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీధర్‌కు వారు రూ.50వేలు విరాళం అందజేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా సభ్యత్వాలు చేయడం కోసమే విరాళం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరిపూటి రమణ, వన్నూరప్ప, మహేంద్ర, చిరంజీవి, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి

రాప్తాడు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వాతావరణ బీమా ప్రీమియంను ఈ నెలాఖరు వరకు చెల్లించవచ్చని ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రబీలో టమోటా, మామిడి పంటల రైతులు సీఎస్‌ఈ (కామన్ సర్వీస్ సెంటర్)లో వాతావరణ బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ అక్బర్ కంటి ఆస్పత్రిలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధికారి కేపీ లింగమయ్య హాజరై, అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అక్బర్, అగ్నిమాపక శాఖాధికారి కృష్ణకుమార్, ఫైర్ మన్‌లు తిప్పేస్వామి, సుధాకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్లకు నిప్పు

● 14 ఎకరాల్లో డ్రిప్పు వైరు దగ్ధం

బుక్కరాయసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో వెంకటకొండ అనే రైతుకు చెందిన మామిడి తోట ఆదివారం రాత్రి అగ్నికి ఆహుతయ్యింది. కొర్రపాడు గ్రామంలోని రైతు వెంకట కొండ తనకున్న 14 ఎకరాల పొలంలో ఆరెకరాలలో మామిడి, వేరుశనగ, తదితర పంటలు సాగు చేశాడు. ఆదివారం రాత్రి తోటకు నిప్పు అంటుకుంది. ప్రమాదవశాత్తూ జరిగిందా? లేదా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా? అన్న విషయం తెలియాల్సింది. 14 ఎకరాలలో ఉన్న డ్రిప్పు వైరు దాదాపు 70శాతం అగ్గికి అహుతి అయ్యింది. వీటితో పాటు తోటలో ఉన్న మామిడి చెట్లు కాలిపోయాయి. దాదాపు రూ.10 లక్షలపైగా ఆస్తి నష్టం జరిగిందని రైతు వాపోయాడు. కాలిపోయిన అయిన రైతు తోటను సీపీఎం రైతు సంఘం నేతలు సందర్శించి పరామర్శించారు. వెంటనే నష్టపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు శివారెడ్డి, కుళ్లాయప్ప, శ్రీనివాసులు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి కేసులో భర్త అరెస్ట్

గార్లదిన్నె, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): భార్య దాడి చేసిన కేసులో సోమవారం ఆమె భర్తను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపారు. గార్లదిన్నెకు చెందిన అంజలికి రాయదుర్గం నియోజకర్గం కణేకల్‌కు చెందిన నీరుగంటి ఎర్రిస్వామితో వివాహం చేశారు. వీరికి ముగ్గురు సంతానం. అయితే రెండేళ్ల క్రిత్రం భార్య భర్తలు గొడవ పడడంతో అంజలి గార్లదిన్నెలోని పుట్టింటికి వచ్చింది. ఏడు నెలల క్రితం ఎర్రిస్వామి గార్లదిన్నెకు వచ్చి అంజలితో ఘర్షణ పడ్డాడు. ఆ తలపై బ్యాట్‌తో కొట్టడంతో తీవ్రంగా గాయపడగా ఆస్పత్రిలో చేర్చారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుజిరీ షాప్‌లో షార్ట్ సర్క్యూట్

రాప్తాడు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగల్ రోడ్డు సమీపంలో ఉన్న ఓ గుజిరీ షాప్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. సాయంత్రం 5 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించగా, షాప్‌లోని సామగ్రి మొత్తం కాలిపోయింది. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. రాప్తాడు సీఐ శ్రీహర్ష షాపును పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ వలన దాదాపు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు.


శ్రీక్షేత్రంలో గోదారంగనాథస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయంలో...

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలకు సోమవారం నగరంలోని పలు ఆలయాల్లో శ్రీకారం చుట్టారు. సోమవారంతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు జనవరి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం నగరంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రబద్ధంగా నిర్వహించారు. తపోవనంలోని శ్రీక్షేత్రంలో శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో గోదారంగనాథ స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాసన్, రాజగోపాల్, రామాచార్యులు, శ్రీనివాస రాఘవన్, సంధ్య, విష్ణుప్రియ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి దేవాలయం, నగర శివారులోని శివకోటి దేవాలయం, శివబాలయోగి ఆశ్రమాల్లోనూ స్వామివార్లకు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు.


శివబాలయోగి ఆశ్రమంలో అభిషేకం చేస్తున్న దృశ్యం


శివకోటి దేవాలయంలోని శివకామేశ్వరులు

జిల్లాకు సాగునీరు అందించడమే సీఎం లక్ష్యం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పాములాయి సాగునీటి సంఘం సభ్యులు

అనంతపురం రూరల్/రామగిరి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించి, సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తపన అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని పాములాయి చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, ఇతర సభ్యులు, మండల ముఖ్య నాయకులు వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎలాంటి వివాదాలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైనందున వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఆయకట్టు రైతుల విషయంలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి: సీపీఐ

హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు చేయాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీతకు సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ వెంకటాపురంలో వినతి పత్రం ఇచ్చారు. జిల్లాలో అనేక చెరువులకు నీరు అందడ మే కాకుండా దాదాపు 75వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు కాలువను వెడల్పు చేసి ఎక్కువ నీరు అందించాల్సి ఉందన్నారు. అలాకాకుండా కాలువ రెండో దశ అయిన జీడీపల్లి నుంచి లైనింగ్ పనులు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైందని కాదన్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ జిల్లా రైతులకు మేలు చేసే విధంగానే ప్రభుత్వం నిర్ణయం ఉంటుందని తెలిపారు. వీలైనంత ఎక్కువగా నీరు జిల్లాకు అందించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారని పేర్కొన్నారు. మీరు చెప్పిన అన్ని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

నేడు బండమీదపల్లికి ఎమ్మెల్యే రాక

రాప్తాడు: మండలంలోని బండమీదపల్లిలో మంగళవారం ఉదయం 9:30 గంటల కు నిర్వహించే రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతారని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సు పూర్తయిన తరువాత గోకులం షెడ్ల ప్రారంభోత్సవం, సీసీ రోడ్ల పరిశీలన ఉంటుందన్నారు. టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అంతర్రాష్ట్ర బైకుల దొంగ అరెస్ట్


స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితుడితో టూటౌన్ పోలీసులు

అనంతపురం క్రైం,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీసులు అంతర్రాష్ట్ర బైక్‌ల దొంగను అరెస్ట్ చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సోమవారం టూటౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ రుష్యేంద్రబాబు, గౌస్‌పీర్ సిబ్బందితో విద్యుత్‌నగర్ సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం చెళ్లికెర జిల్లా చిత్రదుర్గానికి చెందిన వనరస జితేంద్ర అలియాస్ మరాఠీ జితేంద్ర బైక్‌లో నిలపకుండా వెళ్తుండగా పట్టుకుని విచారించారు. ప్రస్తుతం బుక్కరాయసముద్రంలోని కేపీఎస్‌నగర్‌లో నివాసముంటున్న అతడు పలు బైక్‌ల చోరీల్లో పాల్గొన్నట్లు తేలింది. నగరంలోని ఎస్వీ థియేటర్ సమీపంలో హోండా షైన్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్ప్లెండర్ ప్లస్, ప్రభుత్వాసుపత్రిలో హోండా యాక్టివా స్కూటీ, ప్రకాష్ రోడ్డులోని పోలీస్‌క్వార్టర్స్‌లో హోండా యాక్టివా స్కూటీ దొంగలించినట్లు ఒప్పుకున్నాడు. వాటిని ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో కంపచెట్లలో దాచాడు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

ఆరుగురు టీడీపీ కార్యకర్తలపై కేసు

బుక్కరాయసముద్రం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దరాంపురానికి చెందిన ఆరుగురు టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 7వ తేదీన సిద్దరాంపురం జడ్పీ ఉన్నతపాఠశాలలో తల్లితండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొటోకాల్ విషయంలో టీడీపీ కార్యకర్తలు పాఠశాల సిబ్బందితో వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. అయితే ఈ నెల 13న రాత్రి హడావుడిగా పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం. పూలకుండీలు విసిరి ప్రభుత్వ కార్యక్రమానికి ఆటంకం కల్గించారని నార్పల మండలం గడ్డం నాగేపల్లికి చెందిన చెన్నంవరం ఆదినారాయణ ఆరుగురిపై ఫిర్యాదు చేశాడు. తెలుగు యువత శింగనమల కార్యదర్శి చెన్నమయ్య, బీసీసెల్ కార్యదర్శి నాగేంద్ర ఆలియాస్ నాగు, బీసీ సెల్ నాయకులు కాటమయ్య, బలిజ లక్ష్మయ్య, అక్కులప్ప, చిన్న మద్దిలేటిపై కేసు నమోదు చేశారు. టీడీపీ కార్యకర్తలపై సీఐ అక్రమంగా కేసు బనాయించారని ఆ పార్టీ నాయకులు జిల్లా పోలీసు ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు విచారణ అధికారిగా బీకేఎస్ సీఐని తప్పించి శింగనమల సీఐ కౌల్టయ్యకు అప్పగించారు. ప్రస్తుతం కేసు విచారణ చేస్తున్నట్లు శింగనమల సీఐ తెలిపారు.

కక్ష సాధింపులో భాగమే..: రామలింగారెడ్డి

మండలంలో బుక్కరాయసముద్రం సీఐ కరణాకర్ తెలుగుదేశం కార్యకర్తలపై అక్రమకేసులు బనాయిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ఆరోపించారు. పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రొటోకాల్ విషయంలో అడిగింది వాస్తవమేనని, కాకపోతే అసభ్యకరంగా ప్రవర్తించ లేదన్నారు. కార్యక్రమం సజావుగా సాగిందన్నారు. ఫిర్యాదు చేసిన చెన్నవరం ఆదినారాయణ ఆ కార్యక్రమంలో లేరన్నారు. అలాంటిటప్పుడు విచారణ చేయకుండా కేసు నమోదు ఎలా చేస్తారని పోలీసులను ప్రశ్నించారు. ఈ సంఘటనలోనే కాకుండా స్టేషన్‌కు వచ్చే టీడీపీ కార్యకర్తలపై సీఐ అసభ్యకర పదజాలం ఉపయోగిస్తూ వేదింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం దక్కింది. రెండు రోజుల పాటు మాంటిస్సోరి ఎలైట్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు విజేతగా నిలువగా, విశాఖపట్నం ద్వితీయ స్థానం, అనంతపురం తృతీయ స్థానంలో నిలిచాయి. తృతీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టుకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అభినందనలు తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తాం : ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్న కల్లుమడి సభ్యులు

శింగనమల, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మిడ్ పెన్నార్ ఐదోవ దక్షిణ కాలువ చివరి అయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. కల్లు మడి ఆయకట్టు సంఘం సభ్యులు టీడీపీ జిల్లా అధికార ప్రతి నిధి, రాష్ట్ర పంచాయతీ చాంబర్ కార్యనిర్వహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి తో పాటు ఎమ్మెల్యేని అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు దేగల శ్రీనివాసులు, ఓబుళపతి, బాలిరెడ్డి, నాగేంద్ర, శ్రీనివాసులు, రామాంజినేయులు ఉన్నారు. ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు చిట్టినాయుడు, శశిధర్ నాయుడు, మల్లికార్జున, ఎర్రిస్వామి, ఓబిలేసు, లక్ష్మయ్య, కిరణ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం : డీఎస్పీ

అనంతపురం క్రైం,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు ఇక నుంచి అనంతపురం నగరంలో ట్రాఫిక్ నిబంధనలు కఠినతరంగా ఉంటాయని డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అనంతపురం సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణే ధ్యేయంగా ప్రత్యేక దృష్టి సారించి, నిబంధన ఉల్లంఘనలపై చర్యలు చేపడుతామన్నారు. ఇక నుంచి అవే నిబంధనలను మరింత కఠినతరం చేస్తామన్నారు. సీఐలు రాజేంద్రనాథ్‌యాదవ్, రఘుప్రసాద్, శాంతిలాల్, శ్రీకాంత్, ఎస్ఐ రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

రూ.5కోట్ల మోసంపై ఎస్పీకి వినతి

అనంతపురం క్రైం,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చిట్టీల వ్యాపారం నిర్వహణ సమయంలో రూ.5 కోట్లకు మోసం చేశారని బళ్లారి జిల్లాకు చెందిన దాసరి తిమ్మప్ప యాదవ్ సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం జిల్లా ఎస్పీని కలి సి సమస్య విన్నవించారు. రాయదుర్గం పట్టణానికి చెందిన చెన్నకేశవులు, తిప్పేస్వామి, సిద్దేశ్వర, వెంకటేష్ చిట్టీల తన నుంచి రూ.5కోట్ల నగదు తీసుకుని మోసం చేశారని ఆరోపించారు. డబ్బులు అడిగినం దుకు తనపై దౌర్జన్యానికి దిగారన్నారు. తనపైనే రాయదుర్గంలో కిడ్నాప్, హత్యాయత్నం కేసు పెట్టారని వాపోయారు.

అయ్యప్పస్వామికి లక్ష పుష్పార్చన


లక్ష పుష్పార్చనలో దర్శనమిస్తున్న అయ్యప్పస్వామి


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం ఆవరణలోని హరిహర సుత అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు, భస్మాభిషేకంతో పాటు గురుస్వామి కుర్లపల్లి రంగాచారి నేతృత్వంలో లక్ష పుష్పార్చన చేశారు. ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ దేవతాదీక్షధారులకు భిక్ష అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, కొర్రపాటి శ్రీని వాస్, ఏఎంసీ ప్రకాష్‌నాయుడు, హర్షవర్దన్‌రెడ్డి, మహేష్, హర్షరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఉమేష్ నారాయణ, నాగ, చిన్ని, హరి తదితరులు పాల్గొన్నారు.

'జాతీయతను పెంపొందించుకోవాలి'


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జాతీయత, సమైక్యతను చాటుకోవాలని నెహ్రూ యువకేంద్రం అధికారులు పేర్కొన్నారు. విజయ్ దివాస్‌ను పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం, యువజన జాగృతి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యలత మాట్లాడారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్‌వైకే యువజన జాగృతి సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, ఫాతిమా, ఎస్‌వైకే సభ్యులు రెడ్యానాయక్, సాయినాథ్ పాల్గొన్నారు.

హైవే పనులను వేగవంతం చేయండి

● అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌హెచ్ 544డీ పనులను మరింత వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. హైవేపనులపై స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ రహదారుల పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎన్‌హెచ్ 544డీ హైవేపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అలాంటి సమయంలో మనం మరింత బాధ్యతగా పూర్తిచేయడానికి శ్రద్ధ చూపాలన్నారు. భూసేకరణ, కేటాయింపులు, పరిహారం పంపిణీ, బ్రిడ్జుల నిర్మాణం తదితర పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, హైవే పీడీ తరుణ్‌కుమార్, టెక్నికల్ మేనేజరు మురళీక్రిష్ణ, కడప జిల్లా డీఈ నాగరాజుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి రూ.లక్ష విరాళం

సైనిక సంక్షేమ సాయుధ దళాల పతాక నిధికి రిజిస్ట్రేషన్‌శాఖ రూ. లక్ష విరాళం అందజే సింది. జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ సోమవారం కలెక్టరేట్‌లో ఉన్న కలెక్టరు వినోద్‌కుమార్‌ను కలిసి రూ. లక్ష డీడీని అందజేశారు. ఆయన దానిని జిల్లా సైనిక సంక్షేమాధికారి తిమ్మప్పకు కలెక్టర్ అందజేశారు. పలువురు ఇతర అధికారులు తమవంతు సాయంగా విరాళం అందించారు.

19న ఉచిత మెగా వైద్య శిబిరం

అనంతపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌం డేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న బుక్కరాయసముద్రం మండల కేంద్రం లోని పెద్దమ్మ ఆలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబి రాన్ని నిర్వహిస్తున్న ట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కిమ్స్ సవేరా, శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, భార్గవి అండ్ అర్జున్ హాస్పిటల్, గురు కృప చిల్డ్రన్స్ హాస్పిటల్ యాజమాన్యాల సౌజన్యంతో ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె జబ్బులు, కంటి చికిత్స, చెవి, ముక్కు, గొంతు, జనరల్ సర్జరీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, చిన్న పిల్లల విభాగం డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారన్నారు. 2 డీ ఎకో, ఈసీజీ, ఎన్ఎస్‌టీ టెస్ట్, పాప్ స్మియర్ టెస్ట్, జీఆర్‌బీఎస్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పేరు ఖరారు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా గార్లదిన్నె మండలానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు పేరును ఏకగ్రీవంగా ఖరారు చేశారు. సౌత్‌కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఎంపికపై అనంత పురంలోని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, పార్టీ సీనియర్ నేత ముంటిమడుగు కేశవరెడ్డి, కాలువ ఆయకట్టు చైర్మన్ తదితరులతో సమావేశమయ్యారు. సౌత్ కెనాల్ డిస్ట్రి బ్యూటరీ చైర్మన్ ఎంపిక కోసం గార్లదిన్నె మండలానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు సోదరుడు ఆ యకట్టు చైర్మన్ ఆలం నాగార్జున పోటీ పడ్డారు. దీనిపై మూడు గంటల పాటు చర్చలు జరిపారు. చివరకు తొలుత మూడేళ్లు చంద్రశేఖర్ నాయుడికి అనంతరం రెండేళ్లు ఆలం నాగార్జున కొనసాగే విధంగా ఖరారు చేశారు. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా శింగనమల మండలానికి చెందిన చంద్రాయుడిని ఎంపిక చేశారు. సౌత్ కెనాల్ చైర్మన్ ఎన్నిక మంగళవారం అనంతపురంలోని హెచ్చెల్సీ కార్యాలయంలో జరగనుంది. టీడీపీ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, ఆలం నాగార్జున, దండుశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టర్ ఇంజెక్షన్ అందుబాటులో ఉంచండి

● జేసీకి బాధితుల వినతి

అనంతపురం రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): హిమోఫిలియా బాధి తులకు ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని ఉమ్మడిజిల్లా హిమోఫిలియా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ శివనారాయణ్‌శర్మకు సొసైటీ అధ్యక్షుడు శ్యాంసుందర్ బాధితులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఫ్యాక్టర్ కొరతతో ఎక్కడ సరఫరా కావడం లేదన్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

కార్పొరేషన్ల రుణాలను మాఫీ చేయాలని వినతి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అందజేసిన రుణాలను మాఫీచేయాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం బాధితులతో కలిసి ఆయన గ్రీవెన్స్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు రామకృష్ణ, వెంకటేష్, వన్నూరు, ఓబులేసు, పెద్దన్న, నాగేంద్ర, ప్రసాద్, దిలీప్, గోపాల్ పాల్గొన్నారు.


'కూటమి పాలనలో అభివృద్ధికి పెద్దపీట'

ఆత్మకూరు డిసెంబరు16(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొందరు వైసీపీ నాయకులు పలు పనులు చేయలేదని, అయితే అధికారులు వాటికి బిల్లులు ఎలా ఇస్తారని మండిపడ్డారు. వైసీపీ నాయకుల ఒత్తిడి వల్ల చాలామంది పంచాయతీ కార్యదర్శులు సెలవులపై వెళ్లారని అన్నారు. ఇది ఇలా ఉంటే ప్రస్తుతం మండలంలో రూ. 3కోట్లతో సీసీరోడ్లను అనతికాలంలోనే పూర్తి చేసి, గ్రామాల్లో కూటమి ప్రభుత్వం మంచి పేరు సంపాదించిందన్నారు. ఇది చూసి ఓర్వలేక సొంత పత్రికలో రోతరాతలురాయిన్నారని మండిపడ్డారు. గ్రామాల్లో అభివృద్ధిని చూసి ఓర్వలేక అధికారులపై కొందరు విమర్శలు చేస్తునారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత నాయకత్వంలో అభివృద్ధికి ఢోకా ఉండదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి వెంకటనారాయణ, మండల నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేష్ నాయక్, గోవిందనాయక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత పది రోజుల నుంచి స్థానిక అనంత క్రీడాగ్రామంలో నిర్వహిస్తున్న ఏపీ రాష్ట్ర సబ్‌జూనియర్ బాల, బాలికల జట్ల శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, సీఈఓ వెంకటేశులు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 24వరకు జమ్ముకశ్మీర్‌లో జరిగే సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు జట్లను సిద్ధం చేశామన్నారు. ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధి కారి నరసింహారెడ్డి, కృష్ణా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివారావు, చిత్తూరు కార్యదర్శి రమేష్, సభ్యులు విజయ్, కుబేర్, ప్రభాకర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో నసనకోట విద్యార్థినుల ప్రతిభ


గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ హమీనా బేగం

రామగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా జంప్‌రోప్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని నసనకోటలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ హమీనా బేగం, పీఈటీ సుమలత పేర్కొన్నారు. ఈ పోటీలు ఓడీసీ మండల కేంద్రంలోని విజ్ఞాన్‌స్కూల్ క్రీడామైదానంలో శనివారం జరిగాయి. మొదటి స్థానంలో ముగ్గురు, రెండో స్థానంలో ఐదుగురు, మూడో స్థానంలో ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు.

క్లుప్తంగా..

నేడు రెవెన్యూ సదస్సులు

గుంతకల్లుటౌన్/యాడికి/బెళుగుప్ప, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతగుంతకల్లులో గల అంకాలమ్మ దేవాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమాదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు స్పెషలాఫీసర్, దేవాదాయశాఖ అధికారి, సబ్‌రిజిస్ట్రార్, మున్సిపల్ అధికారులు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే యాడికి మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెనూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాఎరెడ్డి తెలిపారు. బెళుగుప్ప మండలంలోని దుద్దేకుంటలో కూడా రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షర్మిల తెలిపారు.

26న అయ్యప్పస్వామి మండల పూజ

గుత్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో గల అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ అయ్యప్పస్వామి మండల పూజను ఘనంగా నిర్వహించనున్నట్లు హరిహరిపుత్ర కమిటీ నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్నన్యాయాధికారి

ఉరవకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి దుర్గాకల్యాణి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల రక్షణ చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాలలో ఎవరైనా వారి విధులకు ఆటంకం కలిగించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రమణ మహర్షి జయంతి

తాడిపత్రి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం రోడ్డులో ఉన్న భగవాన్ రమణ మహర్షి ఆశ్రమంలో మంగళవారం భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మహేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8గంటలకు ప్రత్యేక పూజలు, 11గంటలకు అంధులకు దుప్పట్లు పంపిణీ, కంటివైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12గంటలకు భక్తులకు అన్నదానం చేపట్టనున్నామన్నారు. సాయంత్రం 5:30 గంటలకు ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడి వీవీ బ్రహ్మంగారి ఉపన్యాసం ఉంటుందని, భక్తులుపెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

26న సీపీఐ ర్యాలీ

గుంతకల్లుటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా పట్టణంలో ఈనెల 26న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీపీఐ నియోజవకర్గ కార్యదర్శి వీరభద్రస్వామి తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ శాఖా కార్యదర్శులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో ఆయన ఈ మేరకు చెప్పారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, నాయకులు పీసీ కుళ్లాయప్ప, సురేష్, ఈశ్వరయ్య, కత్తిశ్రీనివాసులు, మల్లయ్య, పుల్లయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ హాస్టల్ తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మారెంపల్లి కాలనీలో గల ఏపీఆర్ఎస్ హాస్టల్‌ను తహసీల్దార్ భాస్కర్ సోమవారం తనిఖీ చేశారు. అనంతపురానికి చెందిన విజయ్‌సాయి ఏపీఆర్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. అయితే అతను హాస్టల్ నుంచి ఉదయం 11 గంటలకు బయటకి వెళ్లిపోయాడు. అటు పాఠశాలకు, ఇటు ఇంటికి వెళ్లలేదు. తిరిగి హాస్టల్‌కు కూడా రాలేదు. దీంతో విద్యార్థి తప్పిపోయినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ హాస్టల్‌కు వెళ్లి ఆరా తీశారు. అనంతరం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక


శ్రీశాంత్‌గౌడ్

ఉరవకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి శ్రీశాంత్‌గౌడ్ జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల అనకాపల్లిలోని తుమ్మలలో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ మారుతి తెలిపారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరిగే జాతీయస్థాయి ఖో-ఖో పోటీల్లో పాల్గొంటారని అన్నారు. జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు.

అంతర్రాష్ట్ర బైక్‌ల దొంగ అరెస్ట్

అనంతపురం క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీసులు అంతర్రాష్ట్ర బైక్‌ల దొంగను అరెస్ట్ చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సోమవారం టూటౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ రుషేంద్రబాబు, గౌస్‌పీర్ సి బ్బందితో విద్యుత్‌నగర్ సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం చెళ్లికెర జిల్లా చిత్రదుర్గానికి చెందిన వనరస జితేంద్ర అలి యాస్ మరాఠీ జితేంద్ర బైక్‌లో నిలపకుండా వెళ్తుండగా పట్టుకుని విచారించారు. ప్రస్తుతం బుక్కరాయసముద్రంలోని కేవీఎస్‌నగర్‌లో ని వాసముంటున్న అతడు పలు బైక్‌ల చోరీల్లో పాల్గొన్నట్లు తేలింది. నగరంలోని ఎస్వీ థియే టర్ సమీపంలో హోండా షైన్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్ప్లెండర్ ప్లస్, ప్రభుత్వాసుపత్రిలో హోం డా యాక్టివా స్కూటీ, ప్రకాష్ రోడ్డులోని పో లీస్‌క్వార్టర్స్‌లో హోండా యాక్టివా స్కూటీ దొంగలించినట్లు ఒప్పుకున్నాడు. వాటిని ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో కంపచెట్లలో దాచాడు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

కుందుర్పి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చలికాలాన్ని దృష్టిలో వుంచుకుని నిరాశ్రయులైన దివ్యాంగులకు సాక్ష్యం దివ్యాంగ సేవా సంస్థ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ నగేష్, ఎంఈవో తిప్పేస్వామి సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడం భగవంతుడు మనకిచ్చిన గొప్ప అదృష్టమన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల్లో మమ్మల్ని భాగస్వాములు చేయాలని సంస్థ నిర్వాహకులకు తెలిపారు. ఎస్ఐ నాగేష్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అక్కులన్న, టీడీపీ నాయకులు, ఎర్రగుంట ఆనంద్, సాక్ష్యం దివ్యాంగ నిర్వాహకులు సజ్జల వెంకటేశులు, మర్రిస్వామి, లక్ష్మీ, ఈరన్న, భీమారావు పాల్గొన్నారు.


దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ, తహసీల్దార్, ఎంఈఓ

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందించాలి

● వైద్యులకు విప్ కాలవ సూచన


వైద్యాధికారితో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆ ఆస్పత్రి వైద్యులకు సూచించారు. స్థానిక తన నివాసంలో సోమవారం ఆయన ప్రభుత్వాస్పత్రి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే ఆస్పత్రి నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఇందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ జ్ఞానసుధ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. దీంతో వైద్యసేవలకు ఆటంకం కలుగుతోందన్నారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అదే విధంగా ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి నియామకం ప్రక్రియను త్వరగా పూర్తి చేయడానికి సభ్యుల పేర్లను సూచించాలని ఆమె విన్నవించారు. స్పందించిన కాలవ వెంటనే డీసీహెచ్‌కు ఫోన్ ద్వారా వైద్యుల కొరత గురించి వివరించారు. ఖాళీలను భర్తీ చేయాలని కోరడంతో సంక్రాంతి లోపు నియమిస్తామని డీసీహెచ్ హామీ ఇచ్చారు.

మతసామరస్యానికి ప్రతీక ఇమామ్‌షావలి ఉరుసు

కణేకల్లు: హజరత్ సయ్యద్ షా ఇమామ్‌షావలి ఉరుసు హిందూ, ముస్లింల మత సామరస్యానికి ప్రతీక అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మాల్యం గ్రామంలో నిర్వహిస్తున్న ఇమామ్‌షావలి 337 ఉరుసు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇమామ్‌షావలి దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇమామ్‌షా వలి ఈ ప్రాంత ప్రజలకు శాంతి, సౌభాగ్యాలతో మెలగాల్సిన ఆవశ్యకతను వివరించి వారిని సన్మార్గంలో నడిపించారని గుర్తు చేశారు. ఆయన చూపిన బాటలోనే అందరూ నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం దర్గా నిర్వాహకులు విప్‌ను శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, మాల్యం సుధాకర్, శరభనగౌడ్, యువరాజ్‌గౌడ్, హరి, సూరి, బీటీ రమేష్, షేక్ ముజ్జు, అనిల్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కంబదూరు-కళ్యాణదుర్గం రోడ్డులో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు


జనసంచారం లేని ప్రధాన వీధి

మంచు కురిసే వేళలో..

● కంబదూరును కమ్మేసిన పొగమంచు
● ఎదుట ఏమీ కనిపించకపోడంతో ఇబ్బంది పడిన వాహనదారులు

కళ్యాణదుర్గం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలకేంద్రంలో సోమవారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఎదుట ఏమీ కనిపించనంతగా మంచు కురిసింది. దీంతో రోడ్లల్లో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని మరీ నెమ్మదిగా ముందుకు సాగారు. దీనికి తోడు చలి వణికిస్తుండడంతో 8 గంటలైనా ప్రజలు ఇళ్ల నుంచి పెద్దగా బయటికి రాలేదు. దీంతో వీధులు నిర్మానుష్యంగా కనిపించాయి.

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లకెర గ్రామంలో సోమవారం వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రథంలో కొలువుదీర్చి బ్రహ్మరథోత్సవాన్ని పురవీధుల్లో నందికోలాటాల మధ్య ఊరేగించారు. తిరిగి సాయంత్రానికి ఆలయం వద్దకు చేర్చారు. కర్ణాటక పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చలి తీవ్రతపై అప్రమత్తంగా ఉండండి


అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి

రాయదుర్గం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతుండడం పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. పట్టణంలోని 6, 10 సచివాలయాల పరిధిలో సోమవారం ఆయన చలితీవ్రత పట్ల అవగాహన కల్పించారు. చలితీవ్రంగా ఉండడంతో దగ్గు, జలుబు, అధిక జ్వరం, శ్వాస తీసుకునేటపుడు గురక శబ్దం లాంటివి వస్తాయని తెలిపారు. వెంటనే ఈ లక్షణాలు ఉంటే గమనించి చికిత్సలు పొందాలని సూచించారు. ముఖ్యంగా ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలో న్యూమోనియా వచ్చే అవకాశం ఉందని, దీని నుంచి రక్షణ పొందడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు, కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

స్పందనకు అధికారుల డుమ్మా

● ముగ్గురు మాత్రమే హాజరు


ముగ్గురు అధికారులు మాత్రమే హాజరైన దృశ్యం

శెట్టూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టితో పాటు ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, హెల్త్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. మండల వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వచ్చారు. అధికారులు కనిపించకపోవడంతో ఊసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా అధికారులు స్పందనకు వచ్చి హాజరు పుస్తకంలో సంతకాలు పెట్టి పక్కనే ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి వెళ్లారని తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

పుట్లూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లికి చెందిన టీడీపీ నాయకుడు పల్లెని శివయ్యనాయుడు గతనెలలో రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రికి చెందిన పార్టీ సీనియర్ నేత ఎస్వీ రవీంద్రారెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి శివయ్యనాయుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఆయన వెంట తాడిపత్రి కౌన్సిలర్ వలి, నాగేశ్వరరెడ్డి, ముస్కి. తదితరులు ఉన్నారు.

బిల్లులు మంజూరు చేయండి

శెట్టూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములకలేడు, రంగయ్య పాలెం గ్రామాల్లో చాలా మంది రైతులు ప్రభుత్వం మంజూరు చేసిన మినీగోకులం షెడ్లను నిర్మించుకున్నారు. నెలలు గడుస్తున్నా ఇంతవరకూ బిల్లులు మంజూరు కాలేదు. దీంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో బిల్లు అంద డం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ అధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్లకు బిల్లులు మంజూరుచేసి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

రేపు ప్రేమవిందు

తాడిపత్రి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): సపోస్ క్రిస్మస్ వేడుకల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రేమవిందు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5:30గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వేడుకలకు క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

అసంపూర్తిగా గోదాము నిర్మాణం

● రూ.30 లక్షల వ్యయంతో పనులు ప్రారంభం
● మరిన్ని నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే ఆగిన వైనం
● ఎనిమిదేళ్లు గడుస్తున్నా... మళ్లీ ప్రారంభంకాని పనులు


ముళ్లకంపల మధ్య నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌యార్డు గోదాము

కణేకల్లు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు అనుకూలంగా మండల కేంద్రంలోని చంద్రబాబునాయుడు కాలనీ వద్ద ఎనిమిదేళ్ల క్రితం సబ్ మార్కెట్ గోడౌన్‌లను నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే ఇప్పటికీ వాటి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దాదాపు రూ.90 లక్షల రూరల్ డెవలప్‌మెంట్ గ్రాంట్‌తో గోదాము నిర్మాణం ప్రారంభించగా 2015-16లో రూ. 30 లక్షల నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతో గోదాము నిర్మించి ప్రహరీ కూడా కట్టారు. మిగతా రూ. 60 లక్షలు మంజూరు కాకపోవడంతో నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారు. పర్యవేక్షణ కూడా లేకపోవడంతో దాని చుట్టూ పెద్ద ఎత్తున ముళ్లకంపలు పెరిగిపోయాయి. గోదాము వద్దకు వెళ్లేందుకు కూడా దారి లేని దుస్థితి ఏర్పడింది. ప్రధాన రహదారి నుంచి కిలోమీటరు మేర లోపల ఉన్న గోడౌన్‌కు వెళ్లాలంటే దారి సమస్య నెలకొంది. గోదాముల వద్దకు వెళ్లాలంటే ప్రైవేటు వ్యక్తుల భూముల్లో నుంచి వెళ్లాల్సి ఉంది. అప్పట్లో వారితో మార్కెట్‌యార్డు అధికారులు దారికి ఎంత మేర అవసరమవుతుందో అంత స్థలాన్ని మార్కెట్ యార్డుకు ఉన్న 3.75 ఎకరాల స్థలంలో ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. అది ఆచరణలో కాకపోవడంతో దారి సమస్య నానుతూ వస్తోంది. రూ.30 లక్షలతో నిర్మించిన గోడౌన్‌ల గదులు వినియోగంలోకి రాకనే శిథిలావస్థకు చేరుకున్నాయి. గోడౌన్‌ల నిర్మాణం పూర్తయితే ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు ఆస్కారం ఉంటుందని ఆశపడ్డ ఈ ప్రాంత రైతన్నలకు నిరాశే మిగిలింది.

ఉన్నతాధికారులకు నివేదించాం

కణేకల్లులో ఉన్న మార్కెట్ సబ్ కమిటీ గోదాముల సమస్యను రాష్ట్ర మార్కెట్ యార్డు అధికారులకు తెలియజేశాం. ఆర్డీఎఫ్ కింద రావాల్సిన మిగతా నిధులతో పాటు దారి సమస్యను కూడా పరిష్కరించాలని అధికారులకు తెలిపాం. ఇటీవల జిల్లా అధికారులు కూడా గోదామును పరిశీలించారు. సాధ్యమైన త్వరలో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు కార్యదర్శి

చికిత్స పొందుతూ చిన్నారి మృతి


లిఖిత (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన దామోదర్, లలితమ్మ దంపతుల కుమార్తె లిఖిత (8) బెంగళూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న లిఖితకు జ్వరం, దగ్గు రావడంతో తల్లిదండ్రులు స్థానికంగా పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ గత 45 రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. లిఖిత కోలుకోవాలని చికిత్స కోసం అనేక మంది దాతలు ముందుకొచ్చి వేలాది రూపాయలు సాయం అందించారని, అయినా చిన్నారి తమకు దక్కలేదని తల్లిదండ్రులు విలపించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాడిపత్రి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్‌సర్కిల్‌లో సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి నడ్డివిరుస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాదిరిగా, అధికారం రాగానే మరోవిధంగా ప్రవర్తించడం సరికాదన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించి విద్యుత్ రంగాన్ని కార్పొరేటర్లకు కట్టబెట్టే యత్నాలు మానుకోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలలకే ట్రూఅప్ చార్జీల పేరుతో దాదాపు రూ.16వేల కోట్ల రూపాయలు ప్రజలపై మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్‌బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, హనుమంతరెడ్డి, నాగరాజు, శ్రీరాములు, రామ్మోహన్, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ


విచారణ చేస్తున్న ఉపాధి అధికారులు

ఉరవకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. బోగస్ మస్టర్ల ద్వారా బిల్లులు డ్రా చేశారని, విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్ల మీద కూడా బిల్లులు కాజేశారని, ఫారం పాండ్ పనులు జరగకుండానే, ఆ పనులు చేసినట్లు చూపి డబ్బులు కాజేశారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ప్రాజెక్టు అధికారి ఈశ్వరయ్య, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీ శైలజ సోమవారం రాయంపల్లిలో విచారణ చేశారు. ఆ గ్రామంలో రూ.21,19,677ల వ్యయంతో ఉపాధి పనులు చేశారు. వాటిలో 40కి పైగా జాబ్‌కార్డులున్నవారు పనులకు వెళ్లకుండానే వారి పేరు మీద నిధులు దుర్వినియోగం అయ్యాయి. ఒక వ్యక్తి పేరు మీద ఉన్న జాబ్‌కార్డులో వారికి తెలియకుండానే పేర్లను నమోదు చేసి డబ్బులు కాజేసినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. రాజశేఖర్ అనే వ్యక్తి విదేశాలలో ఉద్యోగం చేస్తుంటే ఆయన పేరు మీద కూడా పనులు చేసినట్లు చూపించి బిల్లులు డ్రా చేశారు. బూదగవిలో జరిగిన ఉపాధి అక్రమాలపైన పునర్విచారణ చేపడతామన్నారు. వీటిన్నంటిపైన సమగ్ర విచారణ చేసి, నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీఓ విమల పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ ప్రారంభం


శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ

బొమ్మనహాళ్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులకు, అధికారులకు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ దాస్‌నాయక్, ఈఓపీఆర్డీ దాస్ శిక్షణతరగతులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. 19 గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పేదరిక నిర్మూలన, పర్యావరణ సుస్థిరత, సామాజిక సమానత్వంపై శిక్షణ ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు మూడు రోజుల పాటు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ జగదీష్, ఎంఈఓ మల్లికార్జున, సర్పంచులు పరమేష్, లాలూస్వామి, తిప్పేస్వామి, ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

రాయదుర్గం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 0 నుంచి 5 సంవత్సరాల పైబడిన వారికి కొత్త ఆధార్ నమోదు కోసం మంగళవారం నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదును చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. కోటవీధిలోని 13వ వార్డు సచివాలయం, బళ్లారిరోడ్డులోని 16వ వార్డు సచివాలయ కేంద్రాలలో ఆధార్‌నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ నమోదు, బయోమెట్రిక్, అప్‌డేట్, మొబైల్ నంబర్ లింక్, మార్పులు, చేర్పులు కూడా చేస్తారని స్పష్టం చేశారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలని ఆయన కోరారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం చూపండి

బొమ్మనహాళ్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలం చూపాలని కోరుతూ అంబేడ్కర్ సంఘం యూనియన్ నాయకులు సోమవారం తహశీల్దార్ మునివేలుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల కేంద్రంలో విగ్రహం ఏర్పాటు కోసం చాలా రోజులుగా స్థలం కోసం తిరుగుతున్నామన్నారు. ఇప్పటివరకు ఎవరూ స్థలం చూపడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్థలం చూపి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. యూనియన్ నాయకులు ప్రకాష్, సాకే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శంకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలను 9959225856 కు ఫోన్ చేసి తెలపాలని ఆయన కోరారు.